జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

కావలెను
రాష్ట్ర వ్యాప్తంగా నూతన శకాన్ని లిఖించబోతున్న
పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి
ఆంధ్రప్రదేశ్ 175 నియోజకవర్గాల నుంచి 175 మంది వాలంటీర్స్ ని నియమిస్తుంది.
ప్రతి వాలంటీర్ కు
నెలకు Rs.25,000/-
Salary ఇవ్వబడును.
విద్యా, వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా వాలంటీర్ గా చేరవచ్చు.
ఆసక్తి గలవారు మీ బయోడేటాను ఆధార్ కార్డు తో సహా
మీ ప్రాంతంలో ఉన్న పార్స్ లీడర్స్ ని సంప్రదించవచ్చు.
లేదా ఈ క్రింది నెంబర్
7660027683 కి వాట్సాప్ చేయగలరు.

సంపుటి 15 సంచిక 282 విశాఖపట్నం | శుక్రవారం 09 జూన్2023 | 8 పేజీలు | వెల : 5.00

# క్లీన్ ఆంధ్రప్రదేశే లక్ష్యం..

## ఈ-ఆటోలను జెండా ఊపి ప్రారంభించిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి



అమరావతి: రాష్ట్రాన్ని క్లీన్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలన్నదే లక్ష్యమని ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ లక్ష్యంతో చిన్న మున్సిపాలిటీల్లోనూ చెత్త సేకరణకు పర్యావరణహితంగా ఉండే విద్యుత్తు ఆటోలను (ఈ-ఆటోలను) సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముందుగా దివంగత మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి సీఎం వైయస్ జగన్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఊపి ఆటోలను ప్రారంభించారు. ఆటోల నిర్వాహణపై డ్రైవర్లను, అధికారులను అడిగి సీఎం వైయస్ జగన్ వివరాలు తెలుసుకున్నారు. రూ.4.10 లక్షల విలువైన 516 ఈ-ఆటోలను మొత్తం రూ.21.18 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసినట్లు తెలిపారు. వీటిని 36 మున్సిపాల్టి లకు వంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ ఆటో సామర్థ్యం 500 కిలోలు అని, మహిళా సాధికారతకు పెద్ద పీట వేస్తూ 'ఈ- ఆటోల' డ్రైవర్లుగా మహిళలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ఇప్పటికే రూ.72 కోట్లతో 123 మున్సిపాలిటీల్లోని 40 లక్షల కుటుంబాలకు తడి, పొడి, హానికర వ్యర్థాల సేకరణకు నీలం, ఆకుపచ్చ, ఎరుపు రంగుల్లోని 120 లక్షల చెత్త బుట్టలను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. గ్రేడ్-1 ఆపై మున్సిపాలిటీల్లో చెత్త సేకరణకు 2,525 పెట్రోల్, డీజిల్, సీఎన్జీ గార్బేజ్ టిప్పర్లను వినియోగిస్తోందన్నారు. అలాగే గుంటూరు, విశాఖపట్నంలలో వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులు ప్రారంభించిందన్నారు. త్వరలో రోజుకు 400 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో మరో ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# ఎ 8 వైఎస్ అవినాష్‌రెడ్డి

## వివేకా హత్య కుట్రలో అవినాష్, భాస్కర్ రెడ్డి ప్రమేయం ఉంది
## భాస్కర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై కౌంటర్‌లో పేర్కొన్న సిబిఐ



హైదరాబాద్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డిని ఎనిమిదో నిందితునిగా సిబిఐ పేర్కొంది. ఈ కేసులో ఇప్పటివరకు సిబిఐ కోర్టుకు సమర్పించిన కౌంటర్లలో అవినాష్‌రెడ్డిని సహ నిందితుడుగానే ప్రస్తావించింది. వైఎస్ భాస్కర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై దాఖలు చేసిన కౌంటర్లో మాత్రం ఆయనను ఎ8గా సిబిఐ అధికారులు చేర్చారు. వివేకానందరెడ్డి హత్యకు కుట్ర, సాక్ష్యాలు తారుమారు చేయడంలో వైఎస్ భాస్కర్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి ప్రమేయం ఉందని, అందుకు తగిన సాక్ష్యాలు ఉన్నాయని, భాస్కర్‌రెడ్డికి గతంలో నేర చరిత్ర ఉందని, సాక్షులను ప్రభావితం చేసేందుకు వారిద్దరూ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని సిబిఐ పేర్కొంది. భాస్కర్‌రెడ్డికి బెయిల్ ఇవ్వొద్దని కోరింది. సిబిఐ కోర్టుకు సమర్పించిన కౌంటర్లో పలు కీలక అంశాలను ప్రస్తావించింది. 'వివేకా హత్య అనంతరం ఎన్.శివశంకర్‌రెడ్డి ఫోన్ చేసిన నిమిషంలోనే అవినాష్‌రెడ్డి హత్యాస్థలికి వచ్చారు. ఉదయం 5.20 గంటలకు ముందే అవినాష్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డితో గంగిరెడ్డి మాట్లాడినట్టు దస్తగిరి వాంగ్మూలం ఇచ్చారు. కేసు పెట్టద్దని, పోస్టుమార్టం వద్దని అప్పటి సిఐ శంకరయ్యకు అవినాష్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి చెప్పారు. సిబిఐకి, కోర్టుకు ఏమీ చెప్పొద్దని దస్తగిరిని ప్రలోభ పెట్టేందుకు అవినాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి అనేక విధాలుగా ప్రయత్నించారు. వివేకా హత్య విషయం బయట ప్రపంచానికి తెలియకముందే అంటే, ఉదయం 6.15 గంటలకు ముందే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి తెలుసు. ఇదే విషయం దర్యాప్తులో కూడా తేలింది. కడప, పులివెందుల ప్రాంతాల్లో భాస్కర్‌రెడ్డి చాలా ప్రభావితం చేయగల వ్యక్తి. ఆయన బయట ఉంటే ఏదో విధంగా సాక్షులను ప్రభావితం చేస్తారు. ఆయనకు షరతులతో బెయిల్ ఇచ్చినా ప్రమాదమే. భాస్కర్‌రెడ్డిపై గతంలో మూడు కేసులు ఉన్నట్లు కడప పోలీసులు సమాచారం ఇచ్చారు. ఈ కేసుల ప్రకారం భాస్కర్‌రెడ్డి నేపథ్యం ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది. రక్తం మరకలు తుడవక ముందే ఫొటోలు, వీడియో తీశారు కాబట్టి సాక్ష్యాలకు ఆటంకం లేదన్న వాదన సరికాదు. బెయిల్ సమయంలోనే సాక్ష్యాలను లోతుగా పరిశీలించడం ప్రాసిక్యూష%ఖ%న్‌కు నష్టం అని సిబిఐ పేర్కొంది. కాగా, వైఎస్ భాస్కర్‌రెడ్డికి బెయిల్ ఇవ్వొద్దని వివేకా కుమార్తె సునీత సిబిఐ కోర్టును కోరారు. ఈ మేరకు కోర్టులో ఆమె లిఖితపూర్వక వాదనలు సమర్పించారు. భాస్కర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై అన్ని పక్షాల వాదోపవాదనలూ పరిశీలించిన సిబిఐ కోర్టు శుక్రవారం తీర్పు ప్రకటించనుంది.

## 'గగన్‌యాన్'పై తొందరపడటం లేదు: ఇస్రో

బెంగళూరు, జూన్ 8: గగన్‌యాన్ ప్రాజెక్టు విషయంలో తొందర పడొద్దని తాము నిర్ణయించినట్టు ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ గురువారం వెల్లడించారు. దేశం చేపడుతున్న మొదటి మానవ సహిత వ్యోమ నౌక ప్రయోగం కచ్చితంగా సురక్షితంగా జరగాలని, విజయవంతం కావాలనేదే తమ ప్రాథమిక లక్ష్యమని ఆయన తెలిపారు. గగన్‌యాన్ తుది ప్రయోగానికి ముందు ఎనిమిది ప్రధాన పరీక్షలు జరపాల్సి ఉన్నదని, ఈ పరీక్షలన్నీ విజయవంతమైతే 2024 - 25 మధ్య ప్రయోగం ఉంటుందని తెలిపారు. అయితే, ఈ క్రమంలో సవాళ్లు ఎదురుకావడం సాధారణమేనని, ఇలాంటి పరిస్థితుల్లో కొంత ఆలస్యం కావచ్చని చెప్పారు.

## కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు

### రాష్ట్రంలోకి 11, 12 తేదీల్లో ప్రవేశం !



అమరావతి : నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు కేరళ తీరాన్ని తాకాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు వారం ఆలస్యంగా కేరళలోకి ప్రవేశించాయని భారత వాతావరణశాఖ గురువారం వెల్లడించింది. అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం, బిపోర్జాయ్ తుపాను రుతుపవనాలను ప్రభావితం చేశాయని, అందుకే వాటి రాక ఈసారి ఆలస్యమైనట్లు తెలిపింది. సాధారణంగా జూన్ 1న నైరుతి రుతుపవనాలు కేరళకు చేరాలి. ఈ ఏడాది మూడు రోజులు ఆలస్యంగా జూన్ 4న కేరళకు చేరుతాయని ముందుగా వాతావరణ శాఖ అంచనా వేసినప్పటికీ.. మొత్తంగా వారం రోజుల తర్వాత కేరళను నైరుతి తాకింది. రుతుపవనాల ప్రవేశంతో కేరళ తీరంలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. అలప్పుజా, ఎర్నాకుళం ప్రాంతాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రస్తుతం లక్షద్వీప్, కేరళ ప్రాంతాలకు విస్తరించిన రుతుపవనాలు 48 గంటల్లో కేరళలోని అన్ని ప్రాంతాలకూ, తమిళనాడు, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలకు విస్తరిస్తాయని ఐఎండి పేర్కొంది.నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ఈ నెల 11, 12 తేదీల్లో ప్రవేశించే అవకాశం వుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. నైరుతి రుతుపవనాల ప్రవేశం నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో ఈ నెల 10నే వర్షాలు కురిసే అవకాశం వుందని పేర్కొంది. ఈ నెల 10న ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, శ్రీసత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు, మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం వుందని తెలిపింది. రాష్ట్రంలో గురువారం కాకినాడ జిల్లా చామవరంలో అత్యధికంగా 44.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. విజయనగరం జిల్లా నెల్లిమర్లలో 43.8, తిరుపతి జిల్లా సత్యవేడులో 43.7, ఎన్‌టిఆర్ జిల్లా చిలకల్లులో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 8 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు మరో 77 మండలాల్లో సాధారణ వడగాడ్పులు వీచాయి.

## హర్యానా రైతులపై విరిగిన లాఠీ



హైదరాబాద్, జూన్ 8: పొద్దుతిరుగుడు విత్తనాలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ ఆందోళన చేస్తున్న రైతులపై హర్యానా పోలీసులు లాఠీలు ఝుళిపించారు. నీటి ఫిరంగులను ప్రయోగించి చెదరగొట్టారు. భారత్ కిసాన్ యూనియన్(చారుని) నాయకుడు గుర్నామ్ సింగ్ పిలుపు మేరకు హర్యానాలోని కురుక్షేత్రలో రైతులు తమ న్యాయమైన డిమాండ్ కోసం షహబాద్ వద్ద ఢిల్లీ - చండీఘడ్ జాతీయ రహదారి(ఎన్‌హెచ్ 44)ని దిగ్భందించారు.ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసులు లాఠీఛార్జికి పాల్పడ్డారు. దీంతో పలువురు గాయాలవగా దవాఖానకు తరలించారు. ట్రాఫిక్‌ను సాఫీగా సాగనివ్వాలంటూ హర్యానా హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వును ఆయన చూపుతున్నారు. రైతు నేతలు ఎంత చెబుతున్న వినకుండా తమ మాట పెడచెవిన పెట్టినందుకే రైతులను చెదరగొట్టడానికి నీటి ఫిరంగులను ప్రయోగించి, లాఠీఛార్జి చేయాల్సి వచ్చిందని చెప్పారు.

## వైసీపీలోకి అంబటి రాయుడు..!




అమరావతి: రాజకీయాల్లోకి వస్తానని ఇప్పటికే ప్రకటించిన ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు ఆ దిశగా తన ప్రయత్నాలను వేగవంతం చేస్తున్నారు. గత నెల 11న సీఎం జగన్‌ను కలిసిన అంబటి రాయుడు తాజాగా మరోసారి సీఎంతో భేటీ అవ్వడం రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. రాయుడు.. జగన్ ను కలిసేందుకు తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి గురువారం మధ్యాహ్నం చేరుకున్నారు. ఇద్దరి మధ్య దాదాపు అరగంటపాటు చర్చలు జరిగాయి. జగన్ తో భేటీ అనంతరం అంబటి రాయుడు అక్కడి నుంచి ఇంటికి బయలు దేరారు. గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన అంబటి రాయుడు వైసీపీలో చేరి.. అక్కడి నుంచే వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో సీఎం జగన్‌ను వెంటవెంటనే కలుస్తుండటం ఈ ప్రచారానికి బలం చేకూర్చుతోంది. అయితే, అంబటి రాయుడు గుంటూరు ఎంపీ లేదా పొన్నూరు ఎమ్మెల్యే టిక్కెట్ కావాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. 2019లోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అంబటి రాయుడు.. చెన్నై సూపర్ కింగ్స్ తరపున చివరి మ్యాచ్ ఆడారు. త్వరలోనే తన సెకండ్ సైడ్ చూస్తారని మే 30న అంబటి రాయుడు ట్వీట్ చేశారు.

## జూన్ 12 నుండి బడులు



అమరావతి: జూన్ 12 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు పున: ప్రారంభమవుతయని మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. 2500 రూపాయలతో ఒక్కో విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్ ఇస్తున్నట్లు తెలిపారు. 12 వ తేదీన విద్యార్థులు అందరికీ ఈ కిట్స్ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పిల్లలకు కావల్సిన అన్ని వసతులు జూన్ 12వ తేదీనే ఇవ్వడం జరుగుతుందని ప్రకటించారు. ఇక, పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం కోసూరులో సీఎం చేతుల మీదుగా జగనన్న విద్యాకానుక ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మరోవైపు.. ఈ నెల 20న రాష్ట్ర స్థాయి, 17న జిల్లా స్థాయి, 15న నియోజకవర్గ స్థాయి టాపర్లకు ప్రోత్సాహకాలు అందించనున్నట్టు వెల్లడించారు మంత్రి బొత్స సత్యనారాయణ.ఇక ఈ నెల 28న అమ్మ ఒడిని నగదును సీఎం జగన్ విడుదల చేస్తారని చెప్పారు. మొదటి దశలో 12 వేల స్కూళ్లలో డిజిటల్ ఎడ్యుకేషన్‌ను జూన్ 12 నుంచి ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు బోధించే ఉత్తమ ఉపాధ్యాయులను విదేశాలకు తీసుకెళ్లి శిక్షణ ఇప్పిస్తామన్నారు. గోరు ముద్ద ద్వారా విద్యార్థులకు మంచి భోజనం అందిస్తున్నామన్నారు.



# వైసిపి లో చక్రం తిప్పుతుంది వారే..!?

## కొంప ముంచనున్న షాడోస్ హవా
## అధికారులకు సైతం వారి మాటే వేదం
## ఆరోపణలు ఎన్ని వచ్చినా పట్టించుకోని నేతలు
## దేవుడు వరమిచ్చినా కనికరించని పూజారులు
## షాడోస్ అనుమతి లేనిదే పార్టీ కీలక నేతను కలవడం కష్టం
## ఊ అంటారా..! ఉలిక్కి పడతారా?
## సర్దుబాటు చర్యలు చేపట్టక పోతే పార్టీకి నష్టం ఖాయం







చీరాల, జూన్ 08, ప్రజాపాలన : ప్రజా సంక్షేమపథకాలతో ప్రజల ఆదరాభిమానాలను పొందిన, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు ఎన్ని కల ఫలితాలు, షాడోస్ హవాతో కొంప ముంచే ప్రమాదం పొంచి ఉంది. ప్రత్యేకించి బాపట్ల, ఉమ్మడి ప్రకాశం జిల్లాలలోని, అధిక నియోజక వర్గాల్లో ఈ పరిస్థితి నెలకొంది. తమ తమ నియోజకవర్గాల ప్రజలతో మమేకమవుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలు, వైసిపి ఎమ్మె ల్యేలు లేని చోట, ఆ పార్టీ నియోజకవర్గాల ఇన్చార్జిలు అహర్నిశలు కృషి చేస్తూ, మంచి పేరు తెచ్చుకుంటున్నారు. ఖచ్చితంగా రాబోయే ఎన్ని కలలో బాపట్ల, ఉమ్మడి ప్రకాశం జిల్లాలలో అన్ని నియోజకవర్గాలలో, అత్యధిక మెజారిటీతో, వైసిపి గెలుపు తధ్యమన్న నమ్మకం సైతం ఏర్ప డింది. అలుపెరుగకుండా ఎమ్మెల్యేలు సైతం, నియోజకవర్గాలలో విస్తృతంగా పర్యటిసస్తూ, నియోజకవర్గాల అభివృద్ధి పనుల పై పూర్తి స్థాయి దృష్టి సారించారు. ఒక ప్రక్క ప్రజా సమస్యలను పరిష్కరిస్తూనే, మరోపక్క అభివృద్ధిని వేగవంతంగా పరుగులు తీయిస్తున్నా రు. వైసిపి ఎమ్మెల్యే లు లేని చోట, వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జి లు కూడా, ఒక ప్రక్క పార్టీని బలోపేతం చేస్తూ ఉండటవే కాకుండా, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు, పార్టీ సంక్షేమ పథకాలను, ప్రజల్లోకి తీసుకు వెళ్లి, రాబోయే ఎన్నికల లో అత్యధిక మెజారిటీతో, పార్టీ ని గెలిపించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు.

అసలు సమస్య అంతా షాడోస్ తోనే...!

అటు ఎమ్మెల్యేని కలవాలన్నా, లేదా వైసిపి ఇన్చార్జి తో తమ బాధలు చెప్పుకోవాలన్నా, షాడోస్ గా వ్యవహరించే వారితోనే సమస్యలు మొద లవుతున్నాయి. తామే చక్రం తిప్పాలని, అంతా తామే అన్నట్లుగా వ్యవహరిస్తున్న షాడోస్ వ్యవహారం వలన, భవిష్యత్తులో పార్టీ ప్రతిష్ట దెబ్బ తినడమే కాకుండా, ఎన్నికల ఫలితాలపై ప్రభావం పడే ప్రమాదం పొంచి ఉంది.

అవినీతి ఆరోపణలు వచ్చినా వారి తీరు మారటం లేదు.

షాడోస్ పై ఎన్నో అవినీతి ఆరోపణలు వచ్చినా, రాజ కీయ కారణాల నేపథ్యంలో, జాలిపడి వదిలేయడం, తెలిసినా తెలియ నట్లుగా, చూసి చూడనట్లు ఎమ్మెల్యేలు, ఇంచార్జి లు వ్యవహరిస్తుండటంతో, షాడోస్ హవా నడుస్తుంది.

దూరం అవుతున్న పార్టీ కీలక శ్రేణులు

షాడోస్ అనుమతి లేనిదే పార్టీ కీలక నేతను కలవడం కూడా కష్టమనే పరిస్థితి నెలకొనడం, ఏదైనా ఉంటే మాకు చెప్పండి, మేము సార్ కు చెబుతామంటూ, షాడోస్ అతిగా వ్యవహరిస్తుండటం, అంకితభావంతో పార్టీ కోసం, పనిచేసే నాయకులకు నచ్చటం లేదు. అసలు తమ గోడు నేరుగా తమ నాయకునికి కూడా, చెప్పుకునే పరిస్థితి లేకపోవటం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మొదట్లో పార్టీ కార్యక్రమా లకు, తండోప తండాలుగా, వచ్చే నాయకుల సంఖ్య క్రమేపీ తగ్గుతోంది. ఇప్పుడు తేడా కనిపిస్తూ ఉన్నా, ఎమ్మెల్యేలు కానీ, వైసీపీ ఇన్చార్జిలు కానీ పట్టించుకోకపోవడం, పలువురు నాయకులకు మింగుడు పడటం లేదు. అందుకే అంటీ అంటన్నట్లుగా, అత్యధిక శాతం నాయకులు మొక్కుబడిగా మాత్రమే పార్టీ కార్యక్రమాలకు హాజరవుతుండటం గమనార్హం.

ఆయా శాఖలలో అధికారులతో కుమ్మక్కు

ఆయా శాఖల అధికారులకు సైతం షాడోస్ మాటే వేదం. కొన్ని సందర్భాలలో వారు సొంతగా కూడా, అధికారులను ప్రభావితం చేస్తున్నా రన్న ఆరోపణలు ఉ న్నాయి. తావేదో నదుల పవిత్రసంగమం లాగా, తామేదో పవిత్రులమనే భావనతో, పైకి నీతి వాక్యాలు మాట్లాడుతూనే, సంపాదనే ధ్యేయంగా, ఆయా శాఖలలో కీలకమైన కొందరు అధికారులతో షాడోస్ కుమ్మక్కై, అక్రమార్జనకు అడ్డదారులు తొక్కేలా వ్యవహరి స్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చివరికి ఎమ్మెల్యేని లేదా, ఇంచార్జిని కలవటానికి వెళ్లినా, గంటల తరబడి వేచిచూడాల్సి రావటం నరకప్రాయంగా మారింది. కేవలం తమకు లబ్ధి చేకూరుతుందనే వారిని మాత్రమే, షాడోస్ ముందు పంపుతున్నారన్న ఆరోపణలు ఉ న్నాయి.

సర్దుబాటు చర్యలు చేపడతారా?

దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించలేదన్న చందాన, ఏ పనికావాలన్నా ముందు షాడోస్‌కు తెలియజేయాల్సి రావడంతో, ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారు. కొందరు నాయకులు సైతం ఎడమొహం, పెడమొహంలాగా వ్యవహరిస్తూ ఉ ండటం గమనార్హం. ఊ అంటారా.. పరిస్థితిని అర్థంచేసుకొని సర్దుబాటుచర్యలు చేపడతారా.?లేక ఉలిక్కిపడి ప్రతిపక్షపార్టీల కుట్ర అని సర్దుకుపోయి, వదిలేస్తారో వేచిచూడాల్సిందే.

## చిట్టినగర్ దేవస్థానంలో స్వామివారికి శ్రీ పుష్ప యాగం లో పాల్గొన్న.. దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ



ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: విజయవాడ పశ్చిమ చిట్టినగర్లో వేంచేసివున్న శ్రీ పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత శ్రీ వేంకటేశ్వరస్వామి వార్ల ద్వాదశ బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం స్వామివారికి శ్రీ పుష్ప యాగం అత్యంత ఘనంగా జరిగింది. వివిధ రకాల పుష్పాలతో శ్రీవారిని కన్నుల పండువగా అలంకరించారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో దేవస్థానం పాలకవర్గం కమిటీ వారు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల్లో విశేష సేవలను అందించిన అర్చకులకు, దేవస్థానం సిబ్బందికి కమిషనర్ ప్రశంసా పత్రాలనుఅందజేశారు .అలాగే డీసీపీ విశాల్ గున్ని శ్రీవారిని దర్శించుకుని పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారి భక్తుడు ఉట్టి విష్ణువర్ధన్ రావు స్వామివారికి వజ్రకవచం అందజేశారు. శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మీ అమ్మవార్ల దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ,కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు తదితర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల్లో శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి అత్యంత ఘనంగా పూజాదికాలు నిర్వహించారు. గురువారం ఉదయం శ్రవణా నక్షత్రం సందర్భంగా ధ్రువ మూర్తికి పంచామృత అభిషేకం అనంతరం స్వామివారికి శ్రీ పుష్ప యాగం కన్నుల పండువగా జరిగింది. అదే రోజు సాయంత్రం ద్వాదశప్రదక్షిణములు అనంతరం శ్రీవారి పవళింపు సేవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను దేవస్థానం ప్రధాన అర్చకులు వినుకొండ రామరత్నమాచార్యులు, ఆలయ సహాయ అర్చకులు శ్రీనివాసుల గోపీనాథ్ , తిరుమల తిరుపతి దేవస్థానం విద్యార్థులు నిర్వహించడం జరిగింది. కాగా ఉదయం, సాయంత్రం శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం భక్తజనుల గోవింద నామస్మరణతో మార్మోగింది. ఈ బ్రహ్మోత్సవాల్లో దేవస్థానం కమిటీ సభ్యులు పొట్నూరి దుర్గాప్రసాద్, మజ్జి ఈశ్వరరావు, కామందుల నరసింహారావు, పిళ్ళా విజయ్, పోతిన బేసికంటేశ్వరుడు , మజ్జి శ్రీనివాసరావు, గూడేల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డిప్లొమా ఇన్ జర్నలిజం" కోర్స్ ఈ వారం ప్రముఖుల ప్రసంగాలు: సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



విజయవాడ, జూన్. 8 :సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యం లో నిర్వహిస్తోన్న "డిప్లొమా ఇన్ జర్నలిజం" కోర్సు విద్యార్థులతో పాటు, రాష్ట్రం లోని వర్కింగ్ జర్నలిస్టులకు ఆన్ లైన్ అవగాహనా తరగతుల్లో భాగంగా ఈ శనివారం (10-06-23)న రిటైర్డ్ ఐ.ఏ.ఎస్. అధికారి, ప్రముఖ కవి వాడ్రేవు చిన వీర భద్రుడు ప్రత్యేక ప్రసంగం ఇవ్వ నున్నారని ఆ సంస్థ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. "తెలుగు జర్నలిజం లో మాండలికాలు - ప్రభావం", అనే అంశం పై శనివారం ఉదయం 8నుంచి 9 గంటల వరకు వాడ్రేవు చిన వీర భద్రుడు ప్రసంగిస్తారని ఆ ప్రకటన లో చైర్మన్ పేర్కొన్నారు. పరిపాలనా వ్యవహారాలతో పాటు, రచనా రంగంలో విశేష అనుభవం కలిగిన వాడ్రేవు చిన వీర భద్రుడు తమ అనుభవాన్ని ప్రసంగ రూపంలో మనకు అందించడం గొప్ప అవకాశమని,"డిప్లొమా ఇన్ జర్నలిజం" కోర్సు విద్యార్థులు, వర్కింగ్ జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదే రోజు "ఆంధ్ర ప్రదేశ్ విద్యా రంగం - సంస్కరణలు " అనే అంశం పై రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ. కె. హేమ చంద్రా రెడ్డి ఉదయం 9నుంచి 10 గంటల వరకు ప్రత్యేక ప్రసంగం ఇస్తారని, డిప్లొమా ఇన్ జర్నలిజం" కోర్సు విద్యార్థులు, వర్కింగ్ జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ గా తాము అధ్యక్షత వహిస్తామని, కోర్సు కోఆర్డినేటర్ ఎల్.వి.కె. రెడ్డి పరిచయకర్తగా, మీడియా అకాడమీ కంటెంట్ ఎడిటర్ కలమండ శరత్ బాబు సమన్వయ కర్తగా వ్యవహరిస్తారని చైర్మన్ ఆ ప్రకటనలో తెలిపారు. జూమ్ అప్లికేషన్ ద్వారా అవగాహన తరగతులకు హాజరవ్వటానికి కావాల్సిన వివరాలు :Zoom Meeting ID: 815 9892 6979 Passcode: 12345


## మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే సమ్మెకు సిద్ధం

### మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూని యన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం హెచ్చరిక




చీరాల, జూన్ 08, ప్రజాపాలన : రాష్ట్ర ప్రభుత్వం మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయ డంలో, రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఏ.పి.మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కప్పల నాగభూషణం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రాష్ట్ర ప్రచార జాతా, గురువారం ఉదయం చీరాలకు చేరుకున్న సందర్భం గా, మునిసిపల్ కార్యాలయం వద్ద జరిగిన ప్రచార సభ నుద్దేశించి నాగభూషణం మాట్లాడుతూ, మునిసిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంజినీ రింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు అమలుచేయాలని, వారికి హెల్త్ అలవెన్స్ లు కూడా అమలు చేయాలని కోరారు. క్లాప్ ఆటో డ్రైవర్ లకు కనీస వేతనం రు.18500/-లు చెల్లించాలని, పట్టణాల విస్తరణకు అనుగుణంగా, కార్మికుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశా రు. ఈ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వంతో ఎన్నిసార్లు చర్చించినా, ప్రభుత్వం వైపు నుంచి స్పందన లేదన్నారు. అంతే కాకుండా కార్మికులకు ఇచ్చే యూనిఫామ్, చెప్పులు, సబ్బులతో పాటు, పనిముట్లు కూడా ఇవ్వడంలేదన్నారు. ఈ సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా చైతన్య యాత్రను చేపట్టామని తెలిపారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే, అనివార్యపరిస్థితులలో సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.నాగేందర్, సీఐటీయూ చీరాల పట్టణ అధ్యక్ష కార్యదర్సులు ఎన్.బాబూ రావు, ఎమ్.వసంతరావు, పి.కొండయ్య, మునిసిపల్ వర్కర్స్ నాయకులు ఎన్.రాజు, ఎమ్.శంకర్, కె.గోపీ, బి.రాంబాబు, డి.సాంయేల్, బి.కుమారి, జి.కొటేశ్వరి, డి.రాజేశ్వరి, వసంత, తిరుప తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటనారాయణ మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సంతాపం



పర్చూరు, జూన్ 08, ప్రజాపాలన : పర్చూరు వానవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయకమిటీ మాజీఅధ్యక్షులు కాళంగి వెంకట నారాయ ణ మృతి పట్ల, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంతాపం తెలిపారు. ఆయన మరణం కుటుంబ సభ్యులకు తీరని లోటన్నారు. ఆయన మరణం చాలా బాధాకరమన్నారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి వెంకటనారాయణ ఎంతగానో కృషి చేశారని, వెంకట నారా యణ సేవలను కొనియాడారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## ప్రజలకు ప్రభుత్వ ఇస్తున్నపథకాలపై అవగాహన కార్యక్రమంలో..కమిషనర్ దినకర్.. సబ్ కలెక్టర్ ఆదితి సింగ్




ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: విజయవాడ కార్పొరేషన్ సర్కిల్-2 పరిధిలో గల గుణదల, 1వ డివిజన్, 1వ సచివాలయం నందు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించడానికి వార్డు సచివాలయము సేవల సదస్సు అవగాహనా కార్యక్రమనికి గురువారం విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఐ.ఏ.ఎస్, సబ్ కలెక్టర్ ఆదితి సింగ్ ఐ.ఏ.ఎస్ పాల్గొన్నారు. ఈ సంధర్భంగా కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్. మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందిస్తున్న వారందరూ ముఖ్యంగా అన్ని పథకాలపై సమగ్ర అవగాహన కల్గి వుండాలనే ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్న ఈ అవగాహనా కార్యక్రమాన్ని వార్డు సచివాలయము సిబ్బంది సద్వినియోగంచేసుకోవాలన్నారు. ఇక్కడ చెబుతున్న విషయాలను శ్రద్ధగా వింటూ, నోట్ చేసుకోవాలని, సందేహాలు ఏమైన వుంటె ఇక్కడే అడిగి తెలుసుకోవాలన్నారు. సచివాలయాలలోని ఇన్స్పెక్షన్ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిస్టరు, స్పందన రిజిష్టరులతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను ప్రాపర్ గా నిర్వహించాలని పెండింగులో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని సచివాలయాల కార్యదర్శులకు కమిషనర్ సూచించారు. ఎస్.డి.జి సర్వే, భూహక్కు సర్వే, ఎ.పి సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, సూచించిన యాక్షన్ ప్లాన్ ను అమలు చేయాలనితెలిపారు. అదేవిధంగా స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులు, నాడు - నేడు పనుల పురోగతి, ఆస్థి పన్ను, యూజర్ చార్జీల వసూళ్ళను సచివాలయ కార్యదర్శులు వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు అందించే సేవల్లో నిబద్ధత పాటించాలని, తమకు నిర్దేశించిన పన్నుల వసూళ్ల లక్ష్యాలను గడువులోపు అందుకోవాలని సూచించారు. జగనన్న కాలనీ లే అవుట్ల నిర్మాణం పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని అమెనిటీస్ కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమములో జోనల్ కమిషనర్-2 యు. సృజన, ఎమ్మార్వో సచివాలయ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మరణించిన దావలకోటయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల ఎఙ్రా



పల్నాడు జిల్లా. నరసరావుపేట. జూన్ 8 (ప్రజా పాలన ప్రతినిధి): మరణించిన దావలకోటయ్య కుటుంబానికి గోపిరెడ్డి చారిటీస్ తరపున వైఎస్ఆర్సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల ఏఙ్రా ఆర్థిక సహాయం చేసి వారి కుటుంబాన్ని ఆదుకున్నారు.స్థానిక క్రిస్టియన్ పాలెం కు చెందిన దావలకోటయ్య 56 సంవత్సరములు . అకస్మాత్తుగా మరణించిన సందర్భంగా వారికి ఘనమైన నివాళులు అర్పించి , వారి ఆత్మకు శాంతి కలగాలని కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి ఆదరణ ఇవ్వాలని దేవుని ప్రార్థిస్తున్నాను అని కందుల ఏఙ్రా అన్నారు. దావల కోటయ్య మరణించిన సందర్భంగా వారి అంతిమయాత్ర కు శవపేటిక గోపిరెడ్డి చారిటీస్ తరపున ఉచితంగా అందించటమైంది. ఈ సందర్భంగా కోటయ్య కుటుంబ సభ్యులు మాట్లాడుతూ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపిరెడ్డి చారిటీస్ నాయకులు కందుల ఏ ఙ్రా కు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియ చేశారు.

## సామినేని అమలాబాను ఫౌండేషన్ సహకారంతో రామాలయానికి మెస్ టైల్స్ ఏర్పాటు



జగ్గయ్యపేట జూన్ 8 ప్రజాపాలన ప్రతినిధి: మండల పరిధిలోని అగ్రహారం గ్రామం ఎస్సీ కాలనీ నందు చి న్న రామాలయం దేవాలయానికి సామినేని విమల భాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమాలభాను స హకారంతో దేవాలయం చుట్టూ మెస్,టైల్స్ ఏర్పాటు చేయించడం జరిగిందిగతంలో ఈ దేవాలయం చు ట్టూ మెస్ లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడు తున్న విషయాన్ని కమిటీ వారు విమలభాను దృష్టికి తీసుకురావడంతో ఈ మెస్, టైల్స్ ఏర్పాటు చేయిం చారు

## సామినేని ఉదయభాను విమలభానును మర్యాద పూర్వకంగా కలసిన ఎంపీడీవో జయచంద్ర



జగ్గయ్యపేట జూన్ 8 ప్రజా పాలన ప్రతినిధి మండల మండల అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహించిన టీ.యస్ జయచంద్ర గాంధీ జిల్లా పంచాయతీరాజ్ అధికారి (డిపిఓ) గా పదోన్నతి పొందిన సందర్భంగా గురువారం రాష్ట్ర ప్రభుత్వవిప్ సామినేని ఉదయ భానుని,వారి సతీమణి సామినేని విమలభానుని, వా రి తనయులు నియోజకవర్గ యువ నాయకులు సా మినేని వెంకట కృష్ణ ప్రసాద్ బాబుని మర్యాద పూ ర్వకంగా కలసి సాలువాతో దంపతులను సన్మానిం చారు

## బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవంలో ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



జగ్గయ్యపేట జూన్ 8 ప్రజాపాలన ప్రతినిధి: నియోజ కవర్గపరిధిలో వత్సవాయి మండలం మక్కపేట మె యిన్ సెంటర్ నందు బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం రంగా రంగా వైభవంగా జరిగింది ఈ ప్ర తిష్ట మహోత్సవ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆలయ పండితులు ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



చౌడేపల్లి మండలం ప్రజా పాలన ప్రతినిధి: పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లి లో 1.60 కోట్ల రూపాయలతో నిర్మించిన నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభించిన రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కార్యక్రమంలో పాల్గొన్న చిత్తూరు ఎంపి ఎన్. రెడ్డప్ప, చిత్తూరు జిల్లా కలెక్టర్ షన్మోహన్, అనంతపురం రేంజ్ ఐజీ అమ్మిరెడ్డి, చిత్తూరు ఎస్పీ రిషాంత్ రెడ్డి, టిటిడి పాలకమండలి సభ్యులు పోకల అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేద మధ్యతరగతి వారికి అందుబాటులో వైద్యం అందిస్తున్న హాస్పటల్ లైఫ్ లైన్ హాస్పిటల్: ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



పల్నాడు జిల్లా. నరసరావుపేట. జూన్ 8 (ప్రజా పాలన ప్రతినిధి. ):పల్నాడు జిల్లాలోని మంచి పేరు తెచ్చుకున్న హాస్పిటల్ లైఫ్ లైన్ హాస్పిటల్ అని నరసరావుపేట శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం చిలకలూరిపేట రోడ్డులోని ఎస్సీ కాలనీ నందు లైఫ్ లైన్ హాస్పటల్ వారిచే నూతన భవన నిర్మానానికి భూమిపూజ కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్



రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ పేరం రాజా నంద రెడ్డి, డాక్టర్ పేరం రాజ్యలక్ష్మి నరసరావుపేట మల్లమ్మ సెంటర్లో లైఫ్ లైన్ హాస్పిటల్ ను ప్రారంభించి మంచి పేరు తెచ్చుకున్నారని అన్నారు. నమ్మకమైన వైద్య సేవలు అందించి గుర్తింపు తెచ్చుకున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. రానున్న రోజుల్లో కూడా సేవా భావంతో తో పనిచేసే డాక్టర్ రాజానంద రెడ్డి, శ్రీమతి డాక్టర్ రాజలక్ష్మి దంపతులు మంచి పేరు తెచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉడా చైర్మన్ మిట్టపల్లి రమేష్ , ఎంపీపీ మొరబోయిన శ్రీనివాసరావు ,మార్కెట్ యార్డ్ చైర్మన్ హనీఫ్ ,జెక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ,పల్నాడు జిల్లా యువజన విభాగ అధ్యక్షులు పడల శివారెడ్డి , కమలాకర్ రెడ్డి ,చల్ల నరపరెడ్డి రెడ్డి ,శివారెడ్డి ,మరియు ప్రముఖ డాక్టర్ లు వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో మంచినీటి సరఫరా




చందర్లపాడు జూన్ 8 ప్రజాపాలన ప్రతినిధి మండల పరిధిలోని కాసరబాద గ్రామంలో మంచినీటి కొరత ఏర్పడిన నేపథ్యంలో నియోజకవర్గ బిజెపి పార్టీ నా యకుల ఆధ్వర్యంలో గత నెల రోజులుగా బూతుకూ రు వెంకటేశ్వర రెడ్డి సౌజన్యంతో గ్రామంలో తిరిగి వా టర్ ట్యాంకు ద్వారా నీళ్లు అందించడం అలాగే యేటి దారి వద్ద కూలింగ్ వాటర్ ని అందించడం భారతీయ జనతా పార్టీ ద్వారా వారి సేవలు అందిస్తున్నారు. అయితే చుట్టూ నది అక్కడ ప్రజలకి ఈ వైసీపీ ప్రభు త్వం నీళ్ళు అందించడం లేదు అలాగే కేంద్రప్రభుత్వం ఇస్తున్న జల్జీవన్ పథకాన్ని అమలు చేసుకోలేక పో యిందని వారన్నారు ఈ నియోజకవర్గంలో ఇంకా కొ న్ని గ్రామాలు రాఘువాపురం కమ్మవారిపాలెం మునగ చర్ల ఇంకా చెప్పుకుంటూ పోతే సుమారు 30 నుంచి 40 గ్రామాల వరకు మంచినీటి సౌకర్యాలులేక ప్రజలు ఇబ్బంది పడతున్నారు జలజీవన్ నిధులు ఏమై పో తున్నాయని బిజెపి నియోజకవర్గ అధ్యక్షుడు తొర్లి కొండ సీతారామయ్య అధికార పార్టీ నాయకులను ప్ర శ్నించారు, ఇదేవిధంగా కొనసాగితే భవిష్యత్తులో అ ధికార పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని ఆ యన తెలిపారు.

## ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.. గవర్నమెంట్ నర్స్ అసోసియేషన్



విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి జూన్ 8 : ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల దేవి ఆధ్వర్యంలో సజ్జల రామకృష్ణారెడ్డి ఆంధ్ర ప్రదేశ్ గవర్నమెంట్ ముఖ్య సలహాదారులును కలసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది . ఇటీవల విడుదల చేసిన జీవో ఔట్సోర్సింగ్ ,కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయటంపై హర్షం వ్యక్తం చేస్తూ , కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ నర్సెస్ కాంట్రాక్ట్ పద్ధతిన అపాయింట్ అయిన నర్సింగ్ ఆఫీసర్స్ గూర్చి వివరించి ,జీవోలో వారిని కూడా పొందుపరచాలని వినపత్రం అందజేశారు.అది పరిశీలించిన సజ్జల రామకృష్ణ సానుకూలంగా స్పందిస్తూ వివరణ ఇచ్చారని అందులో భాగంగా జీవో తీసుకురావడం అంటూ జరిగింది. కనుక దశలవారీగా అందర్నీ రెగ్యులరైజ్ చేయడం జరుగుతుందని మాట ఇస్తున్నానని అన్నారు. వెంటనే స్పందించిన సజ్జల రామకృష్ణ కి రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్ మోహన్ రెడ్డికి, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డికి ,ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ పూనం మాలకొండయ్యకి, ఆంధ్ర ప్రదేశ్ వైద్య శాఖ మంత్రివర్యులు విడుదల రజినికి గవర్నమెంట్ నర్స్ అసోసియేషన్ తరుపున రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల దేవి మరియు కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ శాలిని,విజయ, మౌనిక,రోషిని,సౌమ్య,రేఖ,ఆశాజ్యోతి,మహేశ్వరి, తదితరులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సుబ్రహ్మణ్య స్వామి వారి గుడి ప్రతిష్ట మహోత్సవం లో మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య



జగ్గయ్యపేట జూన్ 8 ప్రజా పాలన ప్రతినిధి మండల పరిధిలోని కే అగ్రహారం గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ అ మ్మవారి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ముత్యాల మ్మ, మద్ది రావమ్మ, మహాలక్ష్మి సుబ్రహ్మణ్య స్వామి వారి గుడి ప్రతిష్ట మహోత్సవంలో అంగరంగ వైభవం గా జరిగింది ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే శ్రీరా మ్ రాజగోపాల్ తాతయ్య హాజరై ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారు లు భక్తులు ప్రజలు విరివిగా పాల్గొన్నారు

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



కంచికచర్ల జూన్ 8 ప్రజా పాలన ప్రతినిధి: పట్టణంలో ని గ్రామ సచివాలయం-1 పరిధిలో గడపగడపకు- మ న ప్రభుత్వం నిధులు రూ. 20 లక్షలు మరియు మండ ల పరిషత్ నిధులు రూ. 4 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లు, డ్రైనేజీ మరియు కల్వర్టుల నిర్మాణ పనులకు శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు గురువారం శంకుస్థాపన నిర్వ హించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ము ఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. కంచికచర్ల పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్ర ణాళికలు రూపొందించి అమలు చేస్తున్నట్లు చెప్పా రు.అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను కూడా ఎటువంటి అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలోనే జమ అయ్యే విధంగా ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొని పారదర్శక పాలన చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పం చ్ వేల్పుల సునీత శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు,మురుమురి పాండు, నారిశెట్టి శ్రీను త దితరులు పాల్గొన్నారు

"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేడ్కర్
BUSSINESS v/s SOCIAL ENGINEERING
20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి
BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు
SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.
స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది
అంబేడ్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేడ్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం
మాస్టర్ కీ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది
మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేడ్కర్
జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

శుక్రవారం 09, జూన్ 2023

# మూడు పార్టీల మ్యూజికల్ చెయిర్స్!

కొంచెంకొంచెంగా కాంగ్రెస్ మీద కేసీఆర్ స్వరం పెంచుతున్నారు. పోయిన అసెంబ్లీ ఎన్నికలప్పుడు కాంగ్రెసే ప్రధాన ప్రత్యర్థి అయినా, అది అప్పుడు మహాకూటమి అనే మహాపరాధానికి ఒడిగట్టి, మహాఓటమిని పొందింది. ఆ తరువాత కేసీఆర్‌కు కాంగ్రెస్‌ను తిట్టే అవసరం రాలేదు. బీజేపీ ఉనికిని నెమ్మది నెమ్మదిగా రాజేస్తూ పోయారు తప్ప, కాంగ్రెస్‌ను ఖాతరు చేయలేదు. కర్ణాటక ఎన్నికలలో కాంగ్రెస్ గెలిచాక, అది కూడా ఫలితాలు వచ్చిన రెండుమూడు రోజులకు గానీ స్పందించలేదు. 'అదో పెద్ద విషయమా!' అన్నారు మొదట, "దేశాన్ని భ్రష్టు పట్టించిందే కాంగ్రెస్, దాని మాటలను తెలంగాణలో ఎవరూ నమ్మరు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎవరూ కర్ణాటక ఫలితాలను పట్టించుకోవద్దు" అని ముక్తాయింపు ఇచ్చారు. మొన్న ఆదివారం నాడు నిర్మల్ సభలో మాట్లాడుతూ, కాంగ్రెస్ వస్తే ధరణిని రద్దు చేస్తారని హెచ్చరించారు. నాగర్ కర్నూల్‌లో మాట్లాడుతూ, కాంగ్రెస్ గనుక అధికారంలోకి వస్తే, ఇంతకాలం తెలంగాణ సాధించిన అభివృద్ధి అంతా నాశనం అవుతుందని అన్నారు.ప్రధాన ప్రత్యర్థి హోదాను ఎవరికి ఇవ్వాలో తానే నిర్ణయించే స్థాయిలో కేసీఆర్ ఉంటూ వచ్చారు. ఇద్దరు ప్రత్యర్థుల మధ్య కప్పల తక్కెడ నిలబెట్టి వినోదం చూశారు. కానీ, ఇప్పుడు, ఆయన ఇవ్వడం వల్ల కాక, కాంగ్రెస్ పార్టీకి సొంతంగానే ప్రత్యర్థి హోదా సమకూరుతున్నట్టు కనిపిస్తోంది. భారతీయ జనతాపార్టీ ఎందుకనో ఈ మధ్య నీరసించిపోయింది, కేసీఆర్ కూడా దాని మీద ప్రత్యేకంగా గురిపెట్టడం లేదు. కాంగ్రెస్‌లోనే ఉంటాయనుకున్న అంతర్గత సమస్యలు, కలహాలు, ఫిర్యాదులు, బాహాటపు ధిక్కారాలు ఇప్పుడు తెలంగాణ బీజేపీలో కూడా కనిపిస్తున్నాయి. తీవ్రంగా, పట్టుదలగా ముందుకు పోవాలన్న ప్రోత్సాహం కూడా ఢిల్లీ నుంచి వారికి అందుతున్నట్టు లేదు.ప్రధాన ప్రత్యర్థిగా కాంగ్రెస్ స్థిరపడుతున్నంత మాత్రాన, కేసీఆర్ లేదా బిఆర్ఎస్ పరిస్థితి బలహీనపడిందనో, పతనోన్ముఖంగా ఉన్నదనో అనుకోవడం పొరపాటు. ఇప్పటికీ, తెలంగాణలో బిఆర్ఎస్, మళ్లీ అధికారంలోకి రాగలిగినంత బలంగానే ఉంది. కానీ, అది అట్లాగే ఉంటుందని లేదు. మునుపటి వలె సౌకర్యవంతమైన ఫలితాలు, మరింత హంగును సమకూర్చే అనంతర చేరికలు, మున్ముందు కూడా జరుగుతాయని లేదు. పరిస్థితులు మారుతున్నాయి. కేసీఆర్‌కే అవకాశాలు హెచ్చుగా ఉన్నాయి కానీ, అట్లాగని నిశ్చింతగా ఉండే పరిస్థితీ లేదు. కేసీఆర్ మాత్రమని ఏముంది, మోదీకే ఆ నిశ్చింత తగ్గిపోతోంది. భారతీయ జనతాపార్టీకి కేంద్రంలో మళ్లీ గెలవడం మాత్రమే సరిపోదు, మరింత బలంతో గెలవాలి. మరింత బలం అటుంచి, సొంతంగా మెజారిటీ రాక, ఇరవై ముప్పై సీట్లు తక్కువ పడతాయేమో అన్న భయం పట్టుకున్నది కాబట్టే, ప్రాంతీయ పార్టీల మీద మృదుమధుర వైఖరిని ప్రదర్శిస్తున్నారు. సొంతంగా గెలవలేని చోట, అక్కడ ఎందుకు అధికంగా శ్రమపడడం? శక్తియుక్తులన్నిటిని కీలకమయిన పోరాటంలో, అంటే సార్వత్రక ఎన్నికలలో కేంద్రీకరిద్దాం అని మోదీ, షా ద్వయం అనుకుంటున్నారు. ప్రతి ప్రాంతీయ పార్టీ ఎప్పుడో ఒకప్పుడు బీజేపీతో కలిసి నడిచిందే అని దేవెగౌడ అన్నమాటలో అసత్యంలేదు. ఈ దేశంలో ప్రస్తుతానికి కాంగ్రెస్ తప్ప, మరే ప్రధాన పార్టీ కూడా బీజేపీతో పూర్తి వైరంతో లేదేమో అనిపిస్తుంది. 2024లో కాంగ్రెస్ బలం పెరగకూడదన్నది బీజేపీ రక్షణాత్మక వ్యూహం. అందుకే తెలంగాణలో తాము కాకపోతే, బిఆర్ఎస్ గెలవడాన్నే కోరుకుంటామని ఒక బీజేపీ పెద్ద నాయకుడు జనాంతికంగా అన్నది!ప్రాంతీయపార్టీలు తక్కువ పడిన సీట్లను అరువు ఇవ్వడమే కాదు, భయపెడితేనో, ప్రలోభపెడితోనో శాశ్వతంగా సభ్యులను కూడా ఇచ్చేయగలవు. అందుకని గత తొమ్మిదేళ్లుగా తామే కొరుక్కుతిన్న, విసిరిపడేసిన, దూరం పెట్టిన చిన్నపార్టీలను, ప్రాంతీయపార్టీలను బుజ్జగించే పనిలో పడ్డారు మోదీ, షా. కొత్త పార్లమెంటు ప్రారంభానికి ముందు ఆదివారం నాడు, ప్రాంతీయ మనోభావాల ప్రస్తావన తీసుకువచ్చారు మోదీ. సెంగోల్లో ప్రాంతీయ, జాతీయవాద ఉద్వేగాల మేళవింపు చూడవచ్చు.బీజేపీకే కాదు, కాంగ్రెస్‌కు కూడా బిఆర్ఎస్ ఆపద్ధర్మ బంధువే. కర్ణాటక తరువాత తెలంగాణలో బీజేపీని తుడిచిపెట్టే పని జరుగుతుందని రాహుల్ గాంధీ అమెరికాలో చేసిన ప్రకటన అనేక కనుబొమలను నాట్యం చేయించింది. తెలంగాణలో బిఆర్ఎస్‌ను కదా కాంగ్రెస్ ఓడించవలసింది అన్న సందేహం వస్తుంది, అంతర్జాతీయ వేదిక మీద తన జాతీయ అజెండా మీదనే రాహుల్ దృష్టి ఉండడం సహజమే కదా అన్న వివరణా దొరుకుతుంది. కానీ, 2024లో ప్రతిపక్షాల దశ తిరిగి, ఒక ప్రత్యామ్నాయం అవసరమైతే, కేసీఆర్ కూడా కాంగ్రెస్‌కు అవసరం అవుతారు. మరి రెండు జాతీయ పక్షాలూ, అనంతర స్నేహాల కోసం ఆశ పెట్టుకుంటే, ఎన్నికల పోరాటం ఎట్లా? కాంగ్రెస్ దృష్టి కూడా 2024 సార్వత్రక ఎన్నికలే కాబట్టి, 2023 డిసెంబర్ ఎన్నికలు పూర్తి వైరంతో, స్పర్ధతో, వైమనస్యంతోనే జరుగుతాయనుకోవాలి! బీజేపీ కూడా అదే స్పిరిట్‌తో పోటీపడుతుందా? పోటీపడి, ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చుతుందా? రెండంచెల తెలంగాణ ఎన్నికలలో చివరికి లాభపడేది ఎవరు? ఒక్క ఏడాది కాలంలోనే, ఆ మాటకు వస్తే, ఒక్క అసెంబ్లీ ఎన్నికలతోనే, దేశంలో పరిస్థితి మారుతున్నదన్న సూచన తెలిసి, రాజకీయ వాతావరణంలో ఎంతో కదలిక వచ్చింది. ఏడాది కిందట 78 శాతం భూభాగాన్ని, 69 శాతం జనసంఖ్యను పాలించిన బీజేపీ, ఇప్పుడు 43 శాతం భూభాగానికి 44 శాతం జనాభాకు మాత్రమే పరిమితమైంది. ప్రధాని అయిన నాలుగేళ్లలో 19 రాష్ట్రాలను గెలుచుకుని మోదీ ఇందిర రికార్డును అధిగమించారు. కానీ, ఇప్పుడు కేవలం 12 రాష్ట్రాలలో మాత్రమే బీజేపీ ముఖ్యమంత్రో, ఉపముఖ్యమంత్రో ఉన్నారు. మతతత్వ అంశాల మీద ప్రజల ఆసక్తి తగ్గింది, విసుగు పెరిగింది. ఆర్థిక సమస్యల మీద, అభివృద్ధి అంశాల మీద ఆలోచన కలుగుతోంది.అట్లాగే, ఉభయ తెలుగు రాష్ట్రాలలో కూడా రాష్ట్ర ప్రభుత్వాల మీద విమర్శ, విముఖత పెరిగాయి. అసంతృప్తిని రాజకీయ నిర్ణయంగా మార్చగలిగిన శక్తి రూపొందితే, ప్రజలు నిర్ణయాత్మక ఫలితాలనే అందించడానికి సిద్ధంగా ఉన్నారు. ఒక్కచాన్స్‌తోనే ప్రజలలో వ్యతిరేకతను జగన్మోహన్ రెడ్డి మూటగట్టుకున్నారు కానీ, కేసీఆర్ రెండోసారి కూడా గెలిచారు. తొమ్మిదేళ్ల పాలనకే పదేళ్ల పండుగ చేసుకుంటున్నది తన విజయాలను హోరెత్తించి, ఓటర్లను ఆకట్టుకోవడానికే. అయితే, జరిగిన మంచితో పాటు, అనేకం చెడు కూడా ఈ తొమ్మిదేళ్లలో జరిగింది. తెలంగాణ ప్రజాసంస్కృతి, రాజకీయ సంస్కృతి అంతా మారిపోయాయి. దీనికి సంబంధించిన రాజకీయ వాదన, విమర్శ ఇంకా బలంగా రూపొందలేదు. కేసీఆర్ మీద బలమైన, ఫలితాన్నివ్వగలిగిన విమర్శను బీజేపీ రూపొందించగలిగింది. అవినీతి, కుటుంబ పాలన, మజ్లిస్ స్నేహం, వగైరా. కానీ, ఆ పార్టీకి క్షేత్రబలం లేదు. కేసీఆర్‌తో గట్టి పోరాటం చేయడానికి ఇప్పుడు కేంద్రం నుంచి అనుమతి కూడా లేదు. అవినీతి గురించి, కుటుంబ పాలన గురించి మాట్లాడగలిగే నైతిక శక్తి తెలంగాణ కాంగ్రెస్‌కు ఉన్నదా అన్నది ప్రశ్న. కర్ణాటకలో సిద్దరామయ్య నాయకత్వం, బొమ్మై ప్రభుత్వంలోని విపరీతమైన అవినీతి కాంగ్రెస్‌కు ఉపకరించాయి. ప్రాంతీయ ఉద్వేగాలను కూడా అక్కడ కాంగ్రెస్ తోడుతెచ్చుకున్నది. ఇప్పటి వరకు తెలంగాణలో కాంగ్రెస్‌కు బిఆర్ఎస్ వ్యతిరేక రాజకీయ వాదన, విమర్శ అన్నవే రూపొందలేదు.

# పెట్టుబడిదారీ విధానంపై యువతలో ఆగ్రహం




పెట్టుబడిదారీ విధానం పట్ల రిపబ్లికన్లలో సానుకూల వైఖరి 78 నుంచి 74 శాతానికి తగ్గింది. ఇదీ మంచి పరిణామమే కదా! పెట్టుబడిదారీ విధానం ఎక్కువ అవకాశాలను కల్పిస్తుందని నమ్ముతున్నవారు తగ్గుతున్నారు. తక్కువ కుటుంబ ఆదాయం ఉన్న వారు సోషలిజం పట్ల సానుకూలంగా ఉంటే ఎక్కువ వస్తున్నవారు పెట్టుబడిదారీ విధానమే ఉండాలని కోరుకుంటున్నారు. జనాలకు మౌలిక అవసరాలైన ఆహారం, ఆరోగ్యం, ఇంటి వసతులను సోషలిజం తీరుస్తుందని 38 శాతం నమ్ముతుంటే 18 శాతానికి పెట్టుబడిదారీ విధానం మీద భ్రమలు ఉన్నాయి. ఎవరు ఎన్ని చెప్పినా చివరికి కారల్ మార్క్స్ చెప్పిందే సరైనదా? అంటూ జర్మన్ కార్పొరేట్ల పత్రిక 'డెర్ స్పీగల్' ఈ ఏడాది జనవరిలో ఒక విశ్లేషణను ప్రచురించింది. అంతకు ముందు గతేడాది సెప్టెంబరులో అమెరికా పరిశోధనా సంస్థ 'ప్యూ' సోషలిజం–పెట్టుబడిదారీ విధానాల గురించి అమెరికన్లలో ఉన్న వైఖరి గురించి సర్వే వివరాలను వెల్లడించింది. దీనిలోని కొన్ని ముఖ్య అంశాలను చూద్దాం. అమెరికాలో పద్దెనిమిది–ఇరవై తొమ్మిది సంవత్సరాల వయస్సు వారిలో సోషలిజాన్ని సమర్థించే వారు 44 శాతం మంది ఉండగా పెట్టుబడిదారీ విధానాన్ని అభిమానించిన వారు 40శాతం ఉన్నారు. 2019 మే నెలలో క్యాపిటలిజం పట్ల సానుకూలంగా ఉన్న వారు 65 శాతం కాగా 2022 ఆగస్టులో వారు 57 శాతానికి తగ్గారు. ఇదే కాలంలో సోషలిజం పట్ల సానుకూలంగా ఉన్నవారు 42 నుంచి 36 శాతానికి తగ్గినట్లు పేర్కొంది. 'ఆక్సియోస్' సర్వే ప్రకారం 2019 నుంచి 2021 వరకు చూస్తే రిపబ్లికన్ పార్టీని సమర్థించే 18–34 సంవత్సరాల యువతలో పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థించేవారు 81 నుంచి 66 శాతానికి తగ్గారు. మొత్తంగా సోషలిజాన్ని సమర్థించే వారు 39 నుంచి 41 శాతానికి పెరిగారు. ధనిక దేశాల్లో పెట్టుబడిదారీ విధానం ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యల పూర్వరంగంలో సోషలిజం, మార్క్స్ మీద ప్రేమ కంటే పెట్టుబడిదారీ విధాన సమర్థకులను హెచ్చరిస్తూ చేసిన విశ్లేషణలు ఇవి అన్నది గమనించాలి. సర్వే సంస్థలు ఇచ్చే ప్రశ్నావళి, దానికి అడిగే సమాధానాల తీరు తెన్నులను బట్టి సమర్థకులు, కాని వారి సంఖ్య మారుతున్నప్పటికీ రూపుదిద్దుకుంటున్న ప్రధాన ధోరణులు ఏమిటన్నదానిని చూడాలి. గతంలో సోషలిజాన్ని వ్యతిరేకించే అంశం గురించి చర్చలు జరిగితే ఇప్పుడు పెట్టుబడిదారీ విధాన వైఫల్యం గురించి కమ్యూనిస్టుల కంటే పెట్టుబడిదారీ విధాన సమర్థకులే ఎక్కువగా మాట్లాడుతున్నారు. "పెట్టుబడిదారీ విధానం మీద విమర్శ కొత్తదేమీ కాదు. కరోనా మహమ్మారి నాలుగో సంవత్సరం, ఉక్రెయిన్ యుద్ధం రెండవ సంవత్సర ప్రారంభంలో గమనించాల్సినంతగా అది పెరుగుతున్నది. అనేక అంశాలు ఎక్కువ కాలం పని చేయవు. ప్రపంచీకరణ కుప్పకూలుతున్నది, దానితో పాటే జర్మన్ తరహా కలిమి కూడా ఉంది.ప్రపంచం శత్రుపూరిత కూటములలో పాదుకొని పోతున్నది. ద్రవ్యోల్బణం పేదలు–ధనికులను మరింతగా వేరు చేస్తున్నది. దాదాపు అన్ని పర్యావరణ లక్ష్యాలు తప్పాయి. వ్యవస్థలో కనిపిస్తున్న కొత్త వగుళ్లన్నింటినీ రాజకీయవేత్తలు ఇంకేమాత్రమూ సరి చేయలేరు. ఒక పెద్ద సమస్య తరువాత మరొకటి వెనుకే వస్తున్నది, అవన్నీ ఒకదానితో ఒకటి సంబంధం కలిగి ఉన్నాయి. ఇంధన సంక్షోభం, వాణిజ్య పోరు, ప్రపంచ యుద్ధం పోకడలు కనిపిస్తున్నాయి. జనాకర్షక (మభ్యపెట్టే) నేతలు, నిరంకుశ పాలకుల నుంచి ప్రజాస్వామ్యం దాడులను ఎదుర్కొంటున్నది. ఇటీవలి వరకు ఈ సమస్యలన్నింటికీ ఒక పరిష్కారం ఉంటుందని, మార్కెట్ తనను తాను రక్షించుకోగలదని అనుకున్నారు. కానీ ఈ రోజు దాన్ని ఎంత మంది నిజంగా నమ్ముతున్నారు? ప్రత్యేకించి అన్ని ప్రతికూలతలు, వాతావరణ సంక్షోభం అనేక రెట్లు పెరుగుతున్నది." ఇలాంటి వర్ణన సాధారణంగా సోషలిస్టు, కమ్యూనిస్టు పార్టీలు చేస్తుంటాయి. కానీ ఇదంతా పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థించే 'డెర్ స్పీగల్' విశ్లేషకుల అభిప్రాయాల సారమే. అంతేనా? "పెట్టుబడిదారీ విధానాన్ని తక్షణమే మౌలికంగా సంస్కరించాల్సి ఉంది. లేకుంటే అది నాశనమౌతుంది గనుక తగిన చర్యలు తీసుకోవాలి" అని రే డాలియో అనే 2200 కోట్ల డాలర్ల హెడ్జ్ ఫండ్ మేనేజర్ చెప్పాడు. ఫైనాన్సియల్ టైమ్స్, గోల్డ్‌మన్ శాచ్స్, బోఫ్స్ వంటి సంస్థలు ఎన్నో ఇలాంటి అభిప్రాయాలను వెల్లడించినట్లు ఆ పత్రిక విశ్లేషకులు ఉటంకించారు. "మహా పెట్టుబడిదారులుగా రుజువు చేసుకున్న వారు ప్రపంచస్థితి గురించి చెబుతూ ఆకస్మికంగా కారల్ మార్క్స్ అభిమానుల మాదిరి మాట్లాడుతున్నారు. అనేక ప్రాంతాల్లో ప్రభుత్వాలు, కార్పొరేట్ ప్రధాన కార్యాలయాలు, అగ్రశ్రేణి మేధావులు, వ్యవహార జ్ఞానులు ఎవరైనా అడుగుతున్న అతి పెద్ద, మౌలిక ప్రశ్న ఏమిటంటే ఈ ఆర్థిక వ్యవస్థతో మనం కొనసాగగలమా అంటున్నారు." అని 'డెర్ స్పీగల్' అన్నదంటే పెట్టుబడిదారులకు తమ వ్యవస్థ మీద తమకే విశ్వాసం సన్నగిల్లుతున్నదని చెప్పినట్లే . దీని అర్థం వారు చేతులు ముడుచుకు కూర్చుంటారని కాదు, దాన్ని అధిగమించేందుకు, జనాన్ని తొక్కిపెట్టేందుకు కొత్త పద్ధతులను వెతికే పనిలో ఉన్నారని చెప్పవచ్చు. ప్రస్తుతం పెట్టుబడిదారీ విధానం సాధారణ సంక్షోభాన్ని కాదు ప్రపంచంలో 2023లో విధానపరమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నట్లు 'డెర్ స్పీగల్' విశ్లేషకులు చెబుతున్నారు. వారి అసలు బాధ ఏమిటో కూడా దాచుకోలేకపోయారు. "పారిశ్రామిక దేశాలలో సంవత్సరాల తరబడి ఒక స్పష్టమైన ఆగ్రహం వ్యాపిస్తున్నది. అది సైద్ధాంతిక కారణాలతో కాదు, ఎందుకంటే ఇళ్ల అద్దెలు విపరీతంగా పెరుగుతున్నాయి, ఎందుకంటే ఆస్తులను కొనుగోలు చేయలేనివిగా మారాయి. వనరులనుంచి సంపదలను సృష్టించే యంత్రం అందరికీ సృష్టించనపుడు దాన్ని ఎందుకు ఆమోదించాలి" అని ప్రశ్నిస్తున్నారని అంటూ అమెరికాలో సోషలిజం పట్ల యువతలో సానుకూల వైఖరి పెరగటాన్ని ఉటంకించారు. అసంతృప్తి, ఆగ్రహం, ఉద్యోగాలకు రాజీనామాలతో నిరసన కొట్టవచ్చినట్లుగా కనిపిస్తోందని, సోషలిస్టు సిద్ధాంతాల పట్ల ఆకర్షితులౌతున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఇదే పత్రిక జరిపిన సర్వేలో పెట్టుబడిదారీ విధానం వాతావరణ సంక్షోభానికి కారకురాలైనట్లు సగం మంది జర్మన్లు భావిస్తున్నట్లు వెల్లడైంది. ఎక్కడైనా సంక్షోభాలు తలెత్తినపుడే దాన్నుంచి బయటపడే మార్గాలను సమాజం వెతుకుతుంది. అసలీ కారల్ మార్క్స్–ఫెడరిక్ ఎంగెల్స్ పుట్టకపోతే ఈ కమ్యూనిస్టు సిద్ధాంతం ఉండేది కాదని కొందరు అనుకుంటారు. వారుగాక పోతే మరొకరు, మరొకరు దోపిడీని అంతం చేసే శాస్త్రీయ సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చి ఉండేవారు. సోషలిజం గాకపోతే మరొక పేరు పెట్టి ఉండేవారు. దోపిడీ అంతం కావటం, సమ సమాజం రావటం తప్ప పేరు ఏదైతేనేం. నిజానికి వారి కంటే ముందుగానే సోషలిజం గురించి చెప్పిన వారున్నారు. దాన్ని సాధించే మార్గం వారు చెప్పలేకపోయారు గనుక వారిని ఊహాజనిత సోషలిస్టులని పిలిచారు. మన దేశంలో కూడా సర్వేజనా సుఖినో భవంతు అని చెప్పిన వారు, వసుధైక కుటుంబం అన్నవారి గురించి తెలిసిందే.అమెరికాలో 'ప్యూ' సంస్థ జరిపిన సర్వే ప్రకారం అక్కడి డెమోక్రాట్లలో అనేక మంది...పౌరుల మౌలిక అవసరాలను సోషలిజం తీరుస్తుందని నమ్ముతున్నారు. వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తుందని రిపబ్లికన్లు చెబుతారు. 2019లో సోషలిజం పట్ల డెమోక్రాట్లలో 65 శాతం మంది సానుకూలంగా ఉన్నారని 2022లో 57 శాతానికి తగ్గినట్లు సర్వే చెప్పింది. పెట్టుబడిదారీ విధానం గురించి సానుకూల వైఖరి ఉన్న డెమోక్రాట్లు ఇదే కాలంలో 55 నుంచి 46 శాతానికి తగ్గినట్లు కూడా పేర్కొన్నది. దీన్ని ఏ విధంగా చూడాలి? ఏ సమాజంలోనైనా మధనం జరగాలి. అమెరికాలో ఇప్పుడు అదే జరుగుతున్నదని చెప్పవచ్చు.

పెట్టుబడిదారీ విధానం పట్ల రిపబ్లికన్లలో సానుకూల వైఖరి 78 నుంచి 74 శాతానికి తగ్గింది. ఇదీ మంచి పరిణామమే కదా! పెట్టుబడిదారీ విధానం ఎక్కువ అవకాశాలను కల్పిస్తుందని నమ్ముతున్నవారు తగ్గుతున్నారు. తక్కువ కుటుంబ ఆదాయం ఉన్న వారు సోషలిజం పట్ల సానుకూలంగా ఉంటే ఎక్కువ వస్తున్నవారు పెట్టుబడిదారీ విధానమే ఉండాలని కోరుకుంటున్నారు.

జనాలకు మౌలిక అవసరాలైన ఆహారం, ఆరోగ్యం, ఇంటి వసతులను సోషలిజం తీరుస్తుందని 38 శాతం నమ్ముతుంటే 18 శాతానికి పెట్టుబడిదారీ విధానం మీద భ్రమలు ఉన్నాయి. మూడు పదులు దాటిన వారిలో వయసుపైబడిన కొద్దీ సోషలిజం పట్ల సానుకూల వైఖరి ఉన్నవారు తగ్గినట్లు సర్వే వెల్లడించింది. దానిలో ఆశ్చర్యం ఏముంది? తీవ్రమైన సోషలిస్టు వ్యతిరేక ప్రచారానికి లోనైన వారు. గతంలో అనుభవించిన సామాజిక రక్షణ పథకాలు నేటి తరాలకు అందుబాటులో ఉండటం లేదు. పాతవారితో పోల్చితే బతుకు దుర్భరంగా మారుతున్నది. అందువలన యువతలో కొత్త ఆలోచనలు. సోవియట్ ఉనికిలో ఉన్నపుడు సోషలిస్టు దేశాల గురించి చేసిన తప్పుడు ప్రచారంతో పోలిస్తే ఇప్పుడు అమెరికాలో అది తగ్గింది. ఎందుకంటే సోషలిజం మీద విజయం సాధించామని అక్కడి పాలకులు మూడు దశాబ్దాల క్రితం ప్రకటించారు. అదే నోటితో ఇప్పుడు పోరు సాగిస్తామని చెప్పలేరు కదా! అందుకే కొత్త తరాలు పెట్టుబడిదారీ విధాన వైఫల్యం గురించి ఆలోచించే క్రమంలో ప్రత్యామ్నాయంగా సోషలిజం తప్ప మరొకటి కనిపించటం లేదు గనుక దాని పట్ల క్రమంగా సానుకూలత పెరుగుతోంది. సోషలిస్టు దేశాలంటే జనానికి ఇచ్చిన మేరకు తీసుకోవటం తప్ప అవసరమైన సరకులను అందించలేరంటూ ఖాళీగా ఉన్న దుకాణాలను చూపి కట్టుకథలను ప్రచారం చేశారు. మరోవైపు చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని విమర్శిస్తారు. కానీ అక్కడి నుంచి కావాల్సిన వస్తువులన్నింటినీ దిగుమతి చేసుకుంటారు. ఆ మేరకు తమ ప్రభుత్వం తమ ఉపాధి అవకాశాలను దెబ్బ తీస్తున్నదని అమెరికన్లు భావించటంతో పాటు చైనా అనేక దేశాలకు వస్తువులను ఎలా అందచేస్తున్నది. అక్కడ ఉపాధిని, ఆదాయాలను ఎలా పెంచుతున్నది అనే మధనం కూడ ప్రారంభమైంది. మనకు పెట్టుబడిదారీ విధానం వలన ఉపయోగం ఏమిటి? అన్న సందేహాలు మొగ్గ తొడిగాయి. వరుసగా వచ్చిన ఆర్థిక మాంద్యాలకు పెట్టుబడిదారీ దేశాలు ప్రభావితమైనట్లుగా చైనాలో జరగకపోవటం కూడా అమెరికన్లలో సోషలిజం పట్ల మక్కువను పెంచింది. నూట ఆరు సంవత్సరాల చరిత్రలో తొలిసారిగా బ్రిటన్‌లో నర్సులు సమ్మె చేశారు. ఫ్రాన్సు సమ్మెలు, ప్రదర్శనల ఆందోళనలతో ఉడికిపోతోంది. ప్రభుత్వం దిగిపోవాలని 74 శాతం మంది కోరుకుంటున్నారు. ఐరోపాలో అనేక దేశాల్లో కార్మికవర్గం వీధుల్లోకి వస్తోంది. పెట్టుబడిదారీ విధానం మీద కరోనాకు ముందే అమెరికాలో దాడి మొదలైందని, తరువాత ఆర్థిక, సామాజిక ఇబ్బందులు పెరగటంతో మరింత తీవ్రమైందని కొందరు గగ్గోలు పెడుతూ పత్రికల్లో రాశారు. పెట్టుబడిదారీ విధానం చితికింది అని న్యూయార్క్ టైమ్స్ పత్రిక, ఇంకేమాత్రం పెట్టుబడిదారీ విధానం పనిచేయదు అంటూ సిఎన్ఎన్, పెట్టుబడిదారీ విధానాన్ని తిరిగి పెద్ద ఎత్తున తిరిగి ప్రారంభించాలి అని ప్రపంచ ఆర్థిక వేదిక వంటివి చెప్పిన తరువాత జనాలకు ఆ వ్యవస్థ మీద విశ్వాసం ఎలా పెరుగుతుంది. మరో ప్రపంచం అదీ సోషలిస్టు సమాజం సాధ్యమే అని చెప్పేందుకు పెట్టుబడిదారీ విధానమే అనేక అవకాశాలను ముందుకు తెచ్చింది.

## ఇక్కడ ఆటలు నిషిద్ధం!

ఏళ్లకేళ్లు ఆడవాళ్లు
ఈడ్చుకుంటూ, ఓర్చుకుంటూ
ఒకరినొకరు పేర్చుకుంటూ
ఎర్ర జెండాలతో యుద్ధం చేస్తూ
లాఠీలతో ఎముకలు విరగ్గొట్టించుకుంటూ
బూటు కాళ్ళ కింద నలిగిపోతూ
బూతుల హెడ్ లైన్స్‌లో చోటు దక్కించుకుంటూ
రక్తంలో నానిపోతూ తరాలకు తరాలుగా
స్వేచ్ఛ కోసం సివిల్ డ్రెస్‌లో యుద్ధం చేస్తూనే ఉన్నారు...
రాజులు పోయారు రాజ్యాలు పోయాయి
స్వేచ్ఛ భూస్థాపితమైపోయింది
ప్రభుత్వాలొచ్చాయి... పాలకులొచ్చారు..
పల్లెలు మాయమైనట్టు
స్వతంత్రం కూడా సమాధైపోయింది!
సిగరెట్ పాకెట్ మీద
పొగ తాగడం నిషేధం అని రాసినట్టు....
ఆట వస్తువుల మీద ఆడటం నిషేధం
అనే అక్షరాలు ఇప్పుడు వెక్కిరిస్తున్నాయి...
మైదానాలు కూడా
మగ వాసనకు సలాం చేస్తున్నాయి!
అవును, నా దేశంలో ఇప్పుడు ఆటలాడడం నిషేధం
నోరు తెరవడం నిషేధం
లైంగిక వేధింపులకు లైసెన్స్ ఉన్న నా దేశంలో
ఆధారముందా? అని అడిగే నోళ్ళ ముందు
నా ఆత్మ గౌరవం ఎప్పుడో ఆత్మహత్య చేసుకుంది!
కారణమేదైనా, మగ రాజకీయ చదరంగంలో
ఆడ ఆటగాళ్లకు 'నీయమ్మ, దానెమ్మ' అనే బిరుదులూ..
అప్పుడేమో అశోక వృక్షం కింద ఒకే ఒక సీత
ఇప్పుడు వందల మంది సీతలు...
వేధింపుల ఆరోపణలు నిరూపణ చేయలేక
బలవంతపు పైత్యాలను ఎదిరించి నిలువలేక..!

**– అమూల్యచందు,**

## దళిత సర్పంచ్ కు అవమానం

వత్సవాయి జూన్ 8 ప్రజాపాలన ప్రతినిధి మండల పరిధిలోని మక్కపేట గ్రామంలో బొడ్రాయి పున ప్రతిష్ట మహోత్సవం గ్రామ పెద్దలు సహకారంతో ఏర్పాటు చేశారు అయితే ఈ మహోత్సవానికి జగ్గయ్యపేట ని యోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు వైఎస్ఆర్సిపి పార్టీనాయకులుఅందరికీఆహ్వానాలుఅందాయి ఈ ఆహ్వానంఅందుకున్న వివిధ పార్టీల నాయకులు ఈ కార్యక్రమానికి హాజరైనారు కానీ గ్రామ మొదటి మహిళ అయిన సర్పంచ్ ని మాత్రం ఈ బొడ్రాయి మ హోత్సవానికి ఎటువంటి సమాచారం లేకుండా నిర్వ హించటం కుల అహంకారం అనే జాడ్యం ఇక్కడ చూ డవచ్చు. సాధారణంగా గ్రామ పరిధిలో ఏ కార్యక్రమం నిర్వహించిన అది ప్రభుత్వపరమైందే కానీ ప్రైవేటు సంబంధించిన కార్యక్రమం కానీ దేవుళ్లకు సంబం ధిం చిన కార్యక్రమమైన పార్టీలకతీతంగా సర్పంచిని ఆ హ్వానిస్తూ ఉంటారు. కానీ ఎక్కడ మాత్రం అదిమచ్చు కైనా అది కనపడలేదు కేవలం కులం అనే కార్డు వల్ల ఇలాంటి వివక్షకు ఇంకా గురవుతూనే ఉన్నారు అది సామాన్య ప్రజల దగ్గర నుంచి ప్రజాప్రతినిధులు అ యినా సరే దళితులను అగ్రకులం వారు ఏదోరకంగా అవమానిస్తూ వస్తున్నారు స్వాతంత్రం సిద్ధించి 75 సంవత్సరాలు దాటినా కూడా కలియుగంలో మనం ఉన్నా అన్ని కులాలు అన్ని మతాలు, సారాంశం ఒక టే అని ప్రసంగాలలో ఊదరగొట్టిన అగ్రకుల నాయకు లు ఇక్కడ మాత్రం దానిని మచ్చుకైనా పాటించరు చెప్పే ది ప్రసంగాలకే పరిమితమై వ్యక్తిగత జీవితాల్లో మా త్రం అవి గట్టిగా పురుడు పోసుకొని ఉంటుంది అనేది ఇక్కడ ప్రత్యక్షంగా చూపించారు. ఈ అవమా న భా రంతో కుంగిపోయిన సర్పంచ్ గుడేటి సారమ్మ భర్త పిచ్చారావు తన సర్పంచి పదవికి రాజీనామాను చే స్తున్నట్లు లేఖ ద్వారా స్పందించారు. ఇలాంటి అవ మానభారాలు దళిత ప్రజాప్రతినిధులకు ఇంకెన్ని భ రించాల్సి వస్తుందో వేచి చూడాలి మరి దీంతో ఇ లాంటి అవమానాలకు శుభం కార్డు పడుతుందా అం టే అది ప్రశ్నార్థకంగానే మిగిలిపోతుందనే చెప్పాలి.

## ఆశా వర్కర్ల ద్వారా పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ



గోకవరం ప్రజా పాలన జూన్ 8 :పిల్లలకు ఆశా వర్కర్లు ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. గురువారం మండల కేంద్రమైన గోకవరంలోని స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు ఆశావర్కర్లు ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. ఎండాకాలంలో వేడిని తట్టుకునేటట్టు పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను హెల్త్ డిపార్ట్మెంట్ సమక్షంలో ఆశావర్కర్ల ద్వారా పంపిణీ చేయడం తో పాటు గ్రామపంచాయతీలో ఓఆర్ఎస్ కేంద్రం కౌంటర్ ఏర్పాటు చేశారు.

## ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు అమలాపురం లో మహిళా పోలీసులు సమావేశంలో పాల్గొన్న అడిషనల్ ఎస్పి అడ్మిన్ ఖాదర్ భాషా

అమలాపురం జూన్ 08 ప్రజాపాలన ప్రతినిధి :అమలాపురం లో గురువారం జిల్లా ఎస్పీ యస్ శ్రీధర్ దిశ నిర్దేశాల ప్రకారం అడిషనల్



ఎస్పి అడ్మిన్ ఖాదర్ భాషా ఆధ్వర్యంలో మహిళా పోలీసులు సమావేశం నిర్వహించారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలో పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్ సెమినార్ హాల్లో అమలాపురం నియోజకవర్గం స్థాయిలో ఉన్నటువంటి మహిళా పోలీసులతో సమావేశాని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అడిషనల్ ఎస్పి అడ్మిన్ శ్రీ ఖాదర్ భాషా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగాఈ సమావేశంలో మహిళా పోలీసుల విధులు, మహిళా భద్రత విషయంలో తీసుకోవాల్సిన కార్యక్రమాలు విషయాలు గురించి పూర్తిగా చర్చించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ ల సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో అమలాపురం డిఎస్పి ఎం. అంబికా ప్రసాద్, దిశా డిఎస్పీ ఎస్. మురళీమోహన్, అమలాపురం టౌన్ సిఐ దుర్గా శేఖర్ రెడ్డి అమలాపురం రూరల్ సీఐ వీరబాబు, సబ్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సంపద సృష్టి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



మునునూరు, జూన్ 08, ప్రజాపాలన ప్రతినిధి: మునునూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో గురువారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూజివీడు డిఎల్పిఓ సుందరి మాట్లాడుతూ స్వచ్ఛ సంకల్ప దీక్షలో భాగంగా సంపద సృష్టి కేంద్రాలనన్నింటిని గ్రామీణ ప్రాంతాలలో వినియోగించాలన్నారు. రోడ్లు, డ్రైనేజీ పరిశుభ్రత పాటించాలన్నారు. చెత్తను రోడ్ల వెంట ఉంచవద్దని, ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసి కనీసం 10 రోజులకు ఓసారి ట్రాక్టర్లతో చెత్తాచెదారం తరలించాలన్నారు. గ్రామాలలో నూరు శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈ ఓ పి ఆర్ డి సత్యనారాయణ, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

## అచ్చుతాపురం అంతటా రామనామ స్మరణతో భక్తి పారవశ్యం



గోకవరం ప్రజాపాలన జూన్ 8: ఊరు, వాడ అనే తేడాలేకుండా రామనామ స్మరణతో మారుమ్రోగాయి. పట్టాభి సీతారామచంద్రస్వామివారి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు పురస్కరించుకుని గోకవరం మండలం అచ్చుతాపురం గ్రామంలో గురువారం వేదపండితులు వి శ్రీమన్నారాయణాచార్యులు యాజ్ఞకములో, కళ్యాణ చక్రవర్తి, ఎస్ టి వి శ్రీనివాసచార్యులు, కృష్ణమాచార్యులు, నేతి ఫణి తదితరుల మంత్రోచరణతో ద్వారతోరణ, ధ్వజకుంభఆరాధన, ప్రాతరారాదన, అర్చన, సేవాకాలం, చతుస్థానార్చన, అగ్ని ప్రతిష్ట, వేదాదిపారాయణములు, మూలమస్త్ర హెూమం, తదితర పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించడం తో అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి సన్నిదిలో తరించారు. దీంతో అచ్చుతాపురం అంతటా రామనామ స్మరణతో భక్తి పారవశ్యంతో భక్తులు తరించారు. వేదపండితులు శ్రీమన్నారాయణాచార్యులు మాట్లాడుతూ రామాయణం అంటే భార్యాభర్తలు ఎలా బ్రతకాలో నేర్పిందని, అన్నదమ్ముల మధ్య బంధం ఎలా ఉండాలో చూపిందని, తండ్రీ కొడుకుల మధ్య బంధం ఏమిటో తెలిపిందని, స్నేహం ఎలా ఉండాలో చెప్పిందన్నారు. ఎన్ని కష్టాలు, నష్టాలు వచ్చినా ధర్మం వైపు నిలబడమని రామాయణం రాముడు చెబుతున్నాడని అందుకే శ్రీరాముడు యుగయుగాలుగా ఆదర్శమయ్యాడన్నారు. ప్రజలంతా సిరిసంపదలతో, సుఖ సంతోషాలతో ఉంటే అది రామరాజ్యమని ఇప్పటికీ ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. శ్రీరామనామాన్ని ఉచ్చరించేటప్పుడు 'రా' అనగానే మన నోరు తెరచుకుని మన లోపల పాపాలన్ని బయటకు వచ్చి ఆ రామనామ అగ్నిజ్వాలలో పడి దహించుకుపోతాయని, ఆ తర్వాత 'మ' అనే అక్షరం ఉచ్చరించినప్పుడు నోరు మూసుకుంటుంది కనుక బయట మనకు కనిపించే ఆ పాపాలు ఏవీ మనలోకి ప్రవేశించలేవని, అందువల్లనే మానవులకు 'రామనామ స్మరణ' మిక్కిలి జ్ఞానాన్ని, జన్మరాహిత్యాన్ని కలిగిస్తుందన్నారు. పదవ తేదీ ఉదయం 5 గంటల నుండి ద్వారతోరణ, ధ్వజ కుంభారాధన, ప్రాతరారాదన, అర్చనా సేవా కాలం, విగ్రహ ప్రతిష్టానంతరం పూజకార్యక్రమాలతో పాటు మహాపూర్ణాహుతి, మహాకుంభప్రోక్షణ, శాంతికళ్యాణం జరుగుతాయని, అనంతరం తీర్థప్రసాద వినియోగ కార్యక్రమాలు, ఆచార్య సన్మాన కార్యక్రమాలు, నిర్వహించడం జరుగుతుందన్నారు. స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు పురస్కరించుకుని విశేష అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. గ్రామస్తులు, భక్తులు, ప్రతిష్టా మహోత్సవాలకు వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామివారి ప్రతిష్ట మహోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు. స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

## సమస్యలు పరిష్కారానికి అందరూ సహకరించాలి



విశాఖపట్నం, ప్రజా పాలన ప్రతినిధి జూన్ 8: గంగవరం పోర్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి అందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. మల్లికార్జున కోరారు. గురువారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా ప్రతినిధులు, గంగవరం పోర్టు కార్మికులు, కార్మిక సంఘాలు, పోర్టు యాజమాన్యంతో జరిగిన చర్చలు విజయవంతం అయ్యాయి. కార్మికుల తరపున నొల్లి తాతారావు, మాత అప్పారావు మాట్లాడుతూ కనీస వేతనం అమలు, బేసిక్ పే పెంపు, జిపిఎస్, గ్రాట్యూటీ, డస్ట్ అలవెన్స్, కార్మికుల పిల్లలకు ఉచిత విద్య, కార్మికులకు వైద్య సదుపాయం తదితర 11 అంశాల సమస్యలను తెలుపగా, కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ కార్మికులపై కక్ష సాధింపు చర్యలు నిలుపుదల చేయాలని, పునరావాస ప్యాకేజీ లో నియమితులైన ఉద్యోగులు శాశ్వతమా, తాత్కాలికమా వివరణ కావాలని, గంగవరం పోర్టు లిమిటెడ్ మరియు గంగవరం పోర్టు సర్వీసెస్ సంస్థల ఉద్యోగులను ఒకే విధంగా పరిగణించాలని కోరగా ఆయా అంశాలపై చర్చలు జరిపారు. గాజువాక శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ గంగవరం పోర్టు లిమిటెడ్ మరియు గంగవరం పోర్టు సర్వీసెస్ ఉద్యోగులను ఒకే విధంగా పరిగణించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఏ. మల్లికార్జున మాట్లాడుతూ సమస్యలు పరిష్కారానికి, చర్చలు విజయవంతం అయ్యేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్మికులు కార్మిక సంఘాలు లేవనెత్తిన అంశాలపై పోర్టు యాజమాన్య ప్రతినిధుల నుండి వివరణ తీసుకున్నారు. కార్మికుల సమస్యలపై యాజమాన్య ప్రతినిధులు ఇచ్చిన వివరణ ప్రకారం కార్మికులు అందరూ శాశ్వత ఉద్యోగులేనని, గంగవరం పోర్టు లిమిటెడ్ మరియు గంగవరం పోర్ట్ సర్వీసెస్ ఉద్యోగులకు ఒకే విధంగా పరిగణిస్తామని తెలిపారు. కార్మికులకు అందిస్తున్న ప్రత్యేక అలవెన్సు రెట్టింపు చేయాలని, కార్మికుల విద్యార్హతలను పరిగణనలోనికి తీసుకొని సాంకేతిక విద్యార్హతలు గల కార్మికులకు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించి వారికి అదనంగా రెండు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని పోర్టు యాజమాన్యానికి కలెక్టర్ తెలిపారు. తొలగించిన కార్మికులను వారి నుండి వివరణ తీసుకొని తిరిగి నియామకం చేయాలన్నారు. బేసిక్ పే పెంపు అంశం ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయమని దాని గూర్చి ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. కార్మికులకు మెరుగైన వైద్య సదుపాయం అందించుటకు ఈఎస్ఐ ఆసుపత్రుల్లోనే కాకుండా, ఇతర ఆసుపత్రుల్లో కూడా చికిత్స అందించుటకు చర్యలు తీసుకోవాల్సిందిగా పోర్టు యాజమాన్యానికి తెలిపారు. పోర్టు యాజమాన్యం సామాజిక బాధ్యతగా పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంచుటకు కృషి చేయాలన్నారు. ఉద్యోగుల రిటైర్మెంట్ అనంతరం వచ్చే గ్రాట్యూటి వీలైనంత ఎక్కువ అందించేందుకు గల అవకాశాలను పరిశీలించాలన్నారు. కార్మికుల యూనియన్ బిల్డింగు పోర్టు ఆవరణ బయట నిర్మించుకొనుటకు నిధులు అందజేస్తామన్నారు. కార్మికులకు రుణాలు మంజూరు విషయమై బ్యాంకులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. పోర్ట్ యాజమాన్యం కార్మిక సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలపై తీసుకున్న చర్యలను వారం రోజుల్లో నివేదిక సమర్పించాలన్నారు. కార్మికులకు సమస్యలు ఉంటే నేరుగా కలెక్టరుకు తెలియజేయవచ్చునని, పోర్టు సాధారణ కార్యకలాపాలకు కార్మికులు అంతరాయం కలిగించకూడదని, యాజమాన్యంతో చర్చించి మెరుగైన ఫలితాలను పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.జె. రావు , సీనియర్ అడ్వైసర్ సాంబశివరావు , సిఈఓ బి.జి గాంధీ, మాజి శాసనసభ్యులు పల్లా శ్రీనివాస రావు ,ఆర్డిఓ హుస్సేన్ సాహెబ్ ,జనరల్ మేనేజర్ డిఐసి సిహెచ్ గణపతి , లేబర్ డిప్యూటీ కమిషనర్ సునీత, డిసిపి ఆనంద్ రెడ్డి , ప్రజా ప్రతినిధులు, కార్మిక సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు .

## మౌలికవసతుల కల్పనకు ప్రాధాన్యత: నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి



విశాఖపట్నం, ప్రజా పాలన ప్రతినిధి జూన్ 8:- తూర్పు నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. గురువారం ఆమె తూర్పు నియోజకవర్గం 15వ వార్డు పరిధిలోని వెంకోజిపాలెం, శెట్టిబలిచి కోలనీ, దుర్గానగర్ ప్రాంతాలలో సిసి రోడ్లు, సిసి డ్రైన్లు, స్మశాన వాటికను అభివృద్ధి పనులకు రూ. 87.70 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త అక్రమాని విజయనిర్మల, కార్పొరేటర్ అప్పారి శ్రీ విద్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ మౌలికవసతుల కల్పనలో జగనన్న ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. 15 వార్డు పరిధిలో ఇప్పటికే ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని నేడు సుమారు 88 లక్షల రూపాయలతో సిసి రోడ్లు, కాలువలు నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. నగర పరిధిలో ప్రతి వార్డును ఒక మోడల్ వాటిగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బుధవారం మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలతో ఉద్యోగలలోనూ, పేద ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆనాడు పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ ని రద్దు చేసి ఓ పి ఎస్ కు సమాంతరంగా జిపిఎస్ ను ఏర్పాటు చేశారని ఇది పదవి విరమణ పొందిన ఉద్యోగులకు ఎంతో మేలు చేస్తుంది అన్నారు. రానున్న రోజుల్లో జగనన్న ప్రభుత్వాన్ని అందరూ అలరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, కార్యనిర్వహణ ఇంజనీర్ శ్రీనివాసరావు, వార్డు ఇంచార్జ్ అప్పారి గిరిబాబు, సచివాలయం సెక్రటరీలు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## వైస్ చైర్మన్ గా కొమ్ము వెంకటేశ్వరరావు



నూజివీడు, జూన్ 08, ప్రజాపాలన ప్రతినిధి: నూజివీడు మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం వైస్ చైర్మన్ గా కొమ్ము వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. కొన్ని అనివార్యమైన వ్యక్తిగత కారణాలతో ప్రస్తుత వైస్ చైర్ పర్సన్ అమిరున్నీసా బేగం రాజీనామాతో ఖాళీ ఏర్పడింది. ఎక్సఫిషియో, స్థానిక ఎమ్మెల్యే మేక ప్రతాప్ సూచనలతో ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారిగా సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్ర వ్యవహరించారు. దళిత సామాజిక వర్గానికి సముచిత స్థానం లభించినట్లు అయిందని అధికార వైసిపి వర్గాలు పేర్కొంటున్నాయి. ఎలాంటి పరిస్థితులలో ఎన్నిక జరగవలసి వచ్చిందో అనే విషయంపై రాజకీయ వర్గాలలో పలు ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. ఏది ఏమైనాప్పటికీ రాజీనామా, ఎన్నిక వంటి ప్రక్రియలు పార్టీ అంతర్గత వ్యవహారంగా తలపండిన రాజకీయ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. రాజీనామాలు చేసిన, కొత్తగా పదవులు లభించినా ప్రజలకు ప్రత్యేకంగా వణుగూరే ప్రయోజనం ఏదైనా ఉందా అంటూ బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు. అందుకే అది ఆ పార్టీ అంతర్గత వ్యవహారంగానే చూసి, వ్యాఖ్యానాలకు, చర్చలకు తావు ఇవ్వకుండా రానున్న ఎన్నికలపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించటం ఎంతో మేలు అంటూ అనుభవజ్ఞులైన రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ, వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కో ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ కుమార్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రతాప్‌కు గజమాలతో ఘన సత్కారం



నూజివీడు, జూన్ 08, ప్రజాపాలన ప్రతినిధి: నూజివీడు మున్సిపల్ కార్యాలయ సమావేశం మందిరంలో గురువారం నాడు స్థానిక శాసనసభ్యులు మేక వెంకట ప్రతాప్ అప్పారావు కు ఘన సన్మానం చేశారు. వైస్ చైర్మన్ ఎన్నిక, ప్రమాణ స్వీకారోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే ప్రతాప్ కు వైసిపి శ్రేణులు గజమాలవేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ సీఎం జగన్ తోడ్పాటుతో నూజివీడు పట్టణ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కో ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ కుమార్,ముసునూరు జడ్పిటిసి వి ప్రతాప్, కొమ్ము వెంకటేశ్వరరావు, శీలం రాము, పిల్లా చరణ్, వైసీపీ నేతలు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూజివీడు ఎండిఓగా విజయ్ కుమార్



నూజివీడు, జూన్ 08, ప్రజాపాలన ప్రతినిధి:నూజివీడు మండల అభివృద్ధి అధికారిగా వి ఏ విజయ్ కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. పామర్రు ఎండిఓ కార్యాలయంలో ఈవో ఆర్ డి గా విధులు నిర్వహించిన విజయ్ కుమార్ పదోన్నతి పై నూజివీడుకు ఎండిఓగా విచ్చేశారు. బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం, ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో అందేలా చూస్తామన్నారు. పల్లెలు పరిశుభ్రంగా, పచ్చదనంతో పరిడవిల్లేలా చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా తనను సంప్రదించవచ్చునని సూచించారు. ఈ సందర్భంగా నూతన ఎండిఓ గా బాధ్యతలు చేపట్టిన విజయ్ కుమార్ ను కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందించి స్వాగతం పలికారు. కొద్దిసేపు నూజివీడు మండలంలో గల గ్రామాలలోని భౌగోళిక స్వరూపం, సమస్యల పట్ల చర్చించారు.

## వేటపాలెం మండలంలో డ్రైన్ కాలువ కబ్జా



బాపట్ల జిల్లా ప్రజా పాలన జూన్ 8ఈ రోజు బాపట్ల జిల్లా కలెక్టర్ పఠాన్ రంజిత్ బాషాని జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ ని కలిసి బాపట్ల జిల్లా, వేటపాలెం మండలం లో ని నాయనపల్లి గ్రామంలో గల సర్వే నెంబర్ 148 లోని ప్రభుత్వ భూమి మరియు డ్రైన్ కాలువ కబ్జాకు గురి కావడం తో దాని పై సదరు వేటపాలెం %వీ=రా%ని ఎన్ని సార్లు కలసి పిర్యాదు చేసినా ఆమె స్పందించకపోయెప్పటికి బాపట్ల జిల్లా కలెక్టర్ గారికి పిర్యాదు చేసి తగు చర్యలు తీసుకోమని వారిని కోరి మన %ఎ=జ×% సంస్థ తరుపున కలెక్టర్ గారికి ఫిర్యాదు చేయడం జరిగినది.వారు సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆస్తిని కాపాడుతాము అని చెప్పి సమాజానికి ఉపయోగపడే ఇలాంటి మంచి పనులు చేస్తున్న హెచ్ ఆర్ సి ఐ సంస్థను అభినందించడం జరిగినది. కలెక్టర్ కి గౌరవపూర్వకంగా శాలువా కప్పి సత్కరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా జాతీయ చైర్మన్ చె న్నుపాటి శ్రీకాంత్ , జాతీయ ప్రధాన కార్యదర్శి నందం నరసింహారావు , ఏపీ స్టేట్ లీగల్ సెక్రెటరీ పెంద్యం రాజ్యలక్ష్మి , బాపట్ల జిల్లా మీడియా సెక్రెటరీ మల్లికార్జున రావు ఈ కార్యక్రమంలో తదితరుపాల్గొన్నారు.

## దుఃఖ నివారణ ఆనందమయ జీవితానికి బుద్ధుని మార్గమే ఉత్తమం



ఉదయం పాకాల అంబేద్కర్ భవనంలో బుద్ధ భూమి పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కె. బాబ్జీ, మండల విద్యాశాఖాధికారి మాట్లాడుతూ బుద్ధుని మార్గమే ఉత్తమం అని అన్నారు. డా.ఆమూరు సుధాకర్ మాట్లాడుతూ ఒకరి పట్ల ఒకరికి ప్రేమ,కరుణ, శీలం కలిగి అహింసా మార్గంలో ప్రయాణం చేయాల్సి అవసరం ఉందన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ బుద్ధుని పై 20 సంవత్సరాలకు పైగా పరిశోధనలు చేసి బోధిసత్వ బిరుదు పొందాడు కావున సమతా మమత లతో శాంతి మార్గాన్ని అనుసరించాలి అన్నారు. అనంతరం పంచశీల, త్రిశరణ , బుద్ధ వందనం సమర్పించారు ఈ కార్యక్రమంలో శ్రీ జ్యోతిరావు, విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీ ఆంజనేయులు గారు బిటీఏ రాష్ట్ర నాయకులు జయబాల, రాజేంద్రుడు తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ వాహనాల వైపు గణనీయమైన మార్పు



విజయవాడ,జూన్ ఆటోమొబైల్ పరిశ్రమ మరింత స్థిరమైన మరియు పర్యావరణ అనుకూల మొబిలిటీ పరిష్కారంగా విద్యుత్ వాహనాల వైపు గణనీయమైన మార్పును చవిచూస్తోంది. మోటార్ ఇండియా యొక్క ప్రసిద్ధ విద్యుత్ వాహనం ,జడ్ ఎస్ ఈవి దాని ఆకట్టుకునే ఫీచర్లు మరియు సామర్థ్యాల కారణంగా కారు ఔత్సాహికులలో అత్యంత డిమాండ్ ఉన్న వాహనంగా మారింది. మార్కెట్ పరంగా చూస్తే నెక్సాన్ ఈవి మరియు జడ్ ఎస్ వి లకు గట్టి పోటీ ఉంది. డ్రోమ్ విశ్లేషణ ప్రకారం, ఆ ధర శ్రేణిలో ఇతర పోటీ ఎస్ యువి లతో పోలిస్తే జడ్ ఎస్ ఈవి అత్యధిక రీసేల్ విలువను కలిగి ఉంది. ఎంజిజడ్ ఎస్ ఈవి అనేది ఒక సెగ్మెంట్ ఉత్పత్తి మరియు 141 హార్స్ పవర్ మరియు 353 ఎన్ ఎం టార్క్ ఉత్పత్తి చేసే విద్యుత్ మోటారును కలిగి ఉంది మరియు విభిన్న డ్రైవింగ్ అవసరాలను తీర్చడానికి మరియు సామర్థ్యాన్ని పెంచడానికి మూడు డ్రైవింగ్ మోడ్లతో (ఎకో, నార్మల్ మరియుస్పోర్ట్స్) వస్తుంది. . అందువల్ల, ఐసివి ఇంజిన్లు మరియు విద్యుత్ వాహనాలలో భారతదేశం యొక్క అత్యంత ప్రియమైన కొన్ని ఎస్ వి ల రీసేల్ విలువను పోల్చడానికి మేము ప్రయత్నించాము.

## జీ తెలుగు అందిస్తోన్న సరికొత్త సీరియల్ మావారు మాస్టారు జూన్ 12 న ప్రారంభం

విజయవాడ, జూన్ 08: తెలుగు రాష్ట్రాల ప్రజలకు 24 గంటలూ వినోదం పంచే జీ తెలుగు మరో సరికొత్త సీరియల్తో మీ ముందుకు రానుంది. ఆసక్తికరమైన మలుపులు, అదిరిపోయే ట్విస్ట్ లతో సాగే సీరియల్స్ను అందిస్తున్న జీ తెలుగు మరో ఆసక్తికరమైన అంశంతో సాగే సీరియల్ను వీక్షకులకు అందించేందుకు సిద్ధమైంది. జీ తెలుగు అందిస్తున్న ఈ కొత్త సీరియల్ భార్యాభర్తలు, అత్తాకోడళ్ల బంధానికి సరికొత్త అర్థం చెబుతుంది.

## దేవరాపల్లిలో గడప గడవకు మంచినీటి కుళాయిలు ఏర్పాటు .. డిప్యూటీ సీయం ముత్యాలనాయుడు



దేవరాపల్లి, ప్రజా పాలన ప్రతినిధి జూన్,08 : రానున్న 25 ఏళ్ళకు సరిపడే విధంగా మండలంలో నీటి సరఫరా వ్యవస్థ ఉండాలని, భవిష్యత్ నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి మూలమూలన నీటి సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి అన్నారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీలు పరిధిలో ఉన్న 96 శివారు గ్రామాలకు 219 జల్ జీవన్ మిషన్ పనులను మూడు దఫాలుగా మంజూరు చేశామని పంచాయతీరాజ్ మంత్రి బూడి ముత్యాల తెలిపారు. దేవరాపల్లి లోని రైవాడ అతిథి గృహంలో గ్రామీణ నీటి సరఫరా అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో అయన మాట్లాడుతూ మూడు దశలో దేవరాపల్లి మండలానికి లి?51 కోట్లు రూపాయలలి నిధులు మంజూరు చేయడం జరిగిందని, ఈ నిధులతో 96 గ్రామాలకు గాను సరిపడా మంచినీటి ట్యాంకులు, పైపు లైన్లు, బోరుబావులు ద్వారా ఇంటింటికి కుళాయి నిర్మాణం ద్వారా సుమారు 16,570 ఇళ్లకు గాను ప్రతి ఇంటికి త్రాగునీటి కుళాయిలు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ముఖ్యంగా దేవరాపల్లి గ్రామపంచాయతీ పరిధిలో దేవరాపల్లి గ్రామానికి గాను లి?4.83 కోట్ల రూపాయలులి మంజూరు చేసామని, ఆవాస గ్రామాలైన అల్లిపురం,ముత్యాలమ్మపాలెం, బంగారమ్మ పాలెం కు సుమారు లి?75 లక్షలులి మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో చేసిన పనుల త్వరితగతిని పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు ఇందులో ఎటువంటి అలసత్వం లేకుండా ఉండడం కొరకు ప్రతి నెల మొదటి వారంలో సమీక్ష సమావేశం విధిగా నిర్వహించి పనుల పురోగతిని పరిశీలిస్తామని తెలిపారు. గ్రామాల్లో వాటర్ ట్యాంక్ నిర్మాణం , పైపు లైను నిర్మాణం ఏకధాటిన సాగాలని కాంట్రాక్ట్ లు అలసత్వం వహిస్తే విధులను వేరొకరికి మల్లిస్తామని తెలిపారు. వాటర్ ట్యాంకు నిర్మాణానికి స్థల సేకరణలు పూర్తి చేశామని మిగిలిన ప్రాంతాలలో సేకరణ చేపడుతున్నామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, డి.ఈ అల్లి సూర్యనారాయణ, ఏ.ఈ.చంద్రశేఖర్, ఎలక్ట్రికల్ ఏ.ఈ.శంకర రావు పాల్గొన్నారు.

## విద్య ద్వారానే జీవితాలలో మార్పు సాధ్యం.. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డి.బి.ఆర్.సి)



పల్నాడు జిల్లా. సత్తెనపల్లి. జూన్ 8 (ప్రజాపాలన ప్రతినిధి): బడి ఈడు పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించినప్పుడే మన జీవితాలలో వారు వెలుగులు నింపుతారని డి.బి.ఆర్.సి రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్పలి అన్నారు.

గురువారం నరసరావుపేట మాగం పుల్లారావు ఎస్ టి యానాది కాలనీలో విద్యా చైతన్య ప్రచార ఉద్యమ సదస్సును గురువారం డి.బి.ఆర్.సి ఆధ్వర్యంలో నిర్వహించారు. లిదళిత బహుజన రిసోర్స్ సెంటర్ నరసరావుపేట సిటీ కోఆర్డినేటర్ పాల వేణులి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో చిన్నప్ప మాట్లాడుతూ గత ఏడాది జిల్లాలో డ్రాప్ అవుట్ అయిన విద్యార్థుల్లో అధిక శాతం యానాదుల విద్యార్థులు ఉండడం అత్యంత బాధాకరం అని అన్నారు, జీవనోపాధిలో భాగంగా తల్లిదండ్రులు వలసలు వెళ్లే క్రమంలో బిడ్డలను కూడా బడి మాన్పించి తీసుకొని వెళ్లడం ద్వారా వారి భవిష్యత్తు లేకుండా పోతుందని, కాబట్టి ప్రత్యామ్నాయ విధానాల ద్వారా అటు పెద్దల ఉపాధికి ఇటు బిడ్డలు చదువుకి ఆటంకాలు ఏర్పడకుండా తగు ఆలోచన చేయాలని తల్లిదండ్రులను ఉద్దేశించి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుపుతున్న సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలను ఉపయోగించుకోవాలని అన్నారు. చదువులు లేకపోవడం వల్లనే దళిత గిరిజనులు నేటికీ సమాజంలో అత్యంత దయనీయమైనటువంటి స్థితిలో ఉన్నారనే విషయాన్ని వారికి గుర్తు చేశారు. మన జీవితాల్లో సమూలమైన మార్పులు చదువుల ద్వారానే సాధ్యమవుతాయని ఆ దిశగా ఆలోచించి ఏ ఒక్క బడి ఈడున్న ఏ ఒక్క విద్యార్థి బడి బయట లేకుండా ఉండేలా తల్లిదండ్రులు చూడాలని అన్నారు . అంగనివాడి సూపర్వైసెర్ వెంకటలక్ష్మిలి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు ఇప్పటికే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్ లు సిద్ధం చేసిందని అమ్మఒడి ద్వారా తల్లులు ఎకౌంట్లో 15 వేల రూపాయలు జమ చేస్తుందని మధ్యాహ్నం భోజన పథకం ద్వారా పౌష్టికాహారాన్ని అందజేస్తుందని తమ బిడ్డలను బడిలో చేర్పించిఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగనివాడి టీచర్ కవితలి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు ఎస్సీ ఎస్టీ జీవితాలలో వెలుగులు నింపడానికి జీవితాంతం కృషి చేశారని వారి జీవితాలను ఆదర్శంగా తీసుకొని మన బిడ్డలను చదివించుకోవాలని, ఎస్టీలకు అనేక సంక్షేమ పథకాలు ఉన్నాయని డ్వాక్రా రుణాల ద్వారా మహిళలు స్వయం శక్తి సాధించాలని అందుకు మా వైపు నుండి ఎల్లప్పుడూ సహకరిస్తామని మీరు కూడా బిడ్డలను చదివించుకోవాలని హితువు పలికారు. పేద బిడ్డల చదువుల కోసం డి బి ఆర్ సి చేస్తున్న కృషిని అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో చివరిగా ఒకటో తరగతిలో చేరుతున్న పిల్లలకు పలక బలపాలు అందజేయడం జరిగినది, ఈ కార్యక్రమంలో కాలని పెద్దలు శ్రీను ,అంగన్వాడీ టీచర్ వాలంటీర్, కాలనీ పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇచ్చే టిడిపి గెలిపించాండి: మాజీ ఎమ్మెల్యేలు నల్లగట్ల, రావిలు



గుడివాడ : 5కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు టిడిపి పూర్తి బరోసా ఇస్తుందని మాజీ ఎమ్మెల్యేలు నల్లగట్ల సామిదాసు, రావి వెంకటేశ్వరరావులు అన్నారు. గురువారం స్థానిక శోభన కాంప్లెక్స్‌లో భవిష్యత్తుకు గ్యారంటీపై గుడివాడ నియోజవర్గ టిడిపి నాయకులకు మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అధ్వర్యంలో అవగాహన సదసును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పార్టీ పరిశీలకుడు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ట సామిదాసు, రాష్ట్ర మహిళ కార్యదర్శి సాయిన పుష్పవతిలు పాల్గొన్నారు. ఈ మినీ మేనిఫెస్టోలో అంశాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించి, భవిష్యత్తుకు గ్యారెంటి బ్రోచరును విడుదల చేశారు. అనతరం వారు మాట్లాడుతూ ఈ నెల 9వ తేదిన గుడివాడలో టిడిపి అధినేత కట్టించిన టిడ్కో గృహాలు నేటి ప్రభుత్వం పంపిణి చేయడం మంచిదనారు. 4సం॥లు క్రితం 85శాతం పూర్తి అయిన టిడ్కో ఇల్లు నేడు వైసీపీ పంపిణి చేయడం టిడిపి విజయమన్నారు. ప్రజల భవిష్యత్తుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహాశక్తి, తల్లికి వందనం పథకం కింద్ర 18 ఏళ్ళు నిండిన స్త్రీకి అడ్డబిడ్డనిధి కింద నెలకు రూ.15వేలు, ఇంట్లో చదివే ప్రతి ఒక్కరికి ఏడాదికి రూ.15వేలు, దీపం పథకం క్రింద ఏడాదికి 3గ్యాసు సిలిండర్లు, ఉచిత బసు ప్రయాణం, నిరుద్యోగులకు నెలకు రూ3వేలు, అన్నదాత పథకం ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేలు, బిసీలకు రక్షణ చట్టం, ఇంటీంటికి మంచినీరు, కుళాయి కనెక్షన్, పూర్ టు రిచ్ ద్వార 5ఏళ్ళలో ఆదాయం రెట్టింపు చేసి ప్రతి ఒక్కరి భవిష్యత్తుకు గ్యారెంటీ ఇవ్వడం టిడిపి ధ్యేయమన్నారు. వచ్చే ఎన్నికల్లో గుడివాడ నుండి రావి వెంకటేశ్వరరావును ఎమ్మెల్యేగా గెలిపించి బూతుల నాని బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో సర్పంచ్ కాకర్ల సుభాస్‌చంద్రబోసు(సురేష), తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గోవాడ శివా, నందివాడ మండల అధ్యక్షుడు సన్యాసిరావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి, నాయకులు యలమంచిలి సతీష్, కంచర్ల సుధాకార్, పొట్లూరి వెంకటకృష్ణరావు, శొంఠి రామకృష్ణ, నెరుసు కాశీ, కర్రే గిరి, సమ్మెట బ్రహ్మజీ, అడుసుమిల్లి మోహనరావు, దాసు శ్యామ్‌ప్రసాద్, శొంఠి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## గోకవరం ఎంపిడిఓగా పద్మజ్యోతి



గోకవరం, ప్రజా పాలన జూన్ 8: ఏజెన్సీ ముఖద్వారం మండల కేంద్రమైన గోకవరం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిణి గా కె పద్మజ్యోతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె 2007 (బ్యాచ్) సీతానగరం, ఐ పోలవరం, రామచంద్రపురం, ముమ్మిడివరం లో ఈఓపిఆర్ డి గా విధులు నిర్వర్తిస్తూ పదోన్నతిపై గోకవరం ఎంపిడిఓ గా బాధ్యతలు చేపట్టినట్లు పద్మజ్యోతి తెలిపారు. పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ఎంపిడిఓ గా బాధ్యతలు చేపట్టిన పద్మజ్యోతిని పలు శాఖల అధికారులు పలువురు ప్రజా ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

## ముఖ్యమంత్రి జగన్‌చే నేడు గుడివాడలో టిడ్కో గృహాలు పంపిణి




గుడివాడ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి నేడు శుక్రవారం ఉదయం 9.30 ని॥లకు టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించేందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు, జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, జిల్లా ఎస్పి పి.జాషువా ప్రతేక శద్ర కనబరిచి అన్ని హంగులను పూర్తి చేశారు. గురువారం స్థానిక మల్లాయపాలెంలోని టిడ్కో గృహాల ప్రాంగణంలో ప్రభుత్వ యంత్రాంగమంతా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

## గుడివాడ ప్రజల సొంత ఇంటికలను సాకారం చేసిన చంద్రబాబు కృతజ్ఞతలు: మాజీ ఎమ్మెల్యే రావి




గుడివాడ : గుడివాడ ప్రజల సొంతింటి కలను సాకారం చేసిన మాజీ సీఎం చంద్రబాబుకు ప్రజల తరఫున కృతజ్ఞతలను మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక శోభన హోటలు వద్ద ఏర్పాటు చేసిన 8వేల 912 టిడ్కో గృహాలు కట్టించిన టిడిపి అధినేత చంద్రబాబు బేనర్‌ను అయన అవిష్కరించారు. ఈ సందర్భంగా రావి మాట్లాడుతూ ఎవరికో పుట్టిన బిడ్డను ముద్దాడినట్లు, చంద్రబాబు నిర్మించిన టిడ్కో ఫ్లాట్లను తన ఘనతగా జగన్ ప్రచారం చేసుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు కృషి ఫలితమే గుడివాడలో 8వేల 912 మంది పేదల సొంతింటి కల సాకారమైందన్నారు. ఎమ్మెల్యేగా కొడాలి నాని అప్పుడు ఏం చేశాడో అందరికీ తెలుసని, నెల రోజులుగా వైసిపి బ్యాచ్ డబ్బాలు కొట్టుకుంటున్నా ప్రజలు వాస్తవాలు గమనిస్తున్నారన్నారు. డిస్టిక్ లెవెల్ కమిటీ ఆమోదంతో టిడిపి హయంలో ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో, 1800 మందిని తొలగించే హక్కు వైసిపికు ఎవరిచ్చారని ప్రశ్నించారు. పేదల పేరు చెప్పుకొని కొడాలి నాని బినామీలు జేబులు నింపుకుంటున్నారని, జగన్ హయాంలో నియోజకవర్గానికో ఉన్మాది తయారవుతున్నాడని మండిపడ్డారు. చంద్రబాబు సీఎం అయిన తర్వాత అందరి లెక్క తెలుస్తామని,తొలగించిన టిట్కో లబ్ధిదారులకు తిరిగి ఫ్లాట్లు అప్పగిస్తామని రావి వెంకటేశ్వరరావు తెలిపారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే బలరామ్



చీరాల, జూన్ 08, ప్రజాపాలన : చీరాల బస్టాండ్ సమీపంలో, ఫ్లై ఓవర్ దగ్గర్లోని, పద్మశాలీయ కళ్యాణ మండపంలో జరుగుతున్న, వేటపాలెం మాజీ సర్పంచ్ మున్నంగి అరుణ్‌కుమార్ కుమారుడు, జశ్వంత్ ఇశ్రా–అమని ల వివాహ వేడుకలకు, చీరాల శాసన సభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే బలరామ్ వెంట, మున్సిప ల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, వైసిపి రాష్ట్రకార్యదర్శి డాక్టర్ వరికూటి.అమృతపాణి, మునిసిపల్‌కౌన్సిలర్లు, వార్డు ఇన్చార్జిలు, నియోజకవర్గ వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్న పూతలపట్టు వైకాపా ఎమ్మెల్యే. ఎంఎస్ బాబుకు చేదు అనుభవం



ప్రజాపాలన ప్రతినిధి: గత నాలుగు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రజలు పడుతున్న ఇబ్బందులను అవకాశం వచ్చినప్పుడు చూపిస్తారు అనడానికి ఇదే నిదర్శనం... పూతలపట్టు వైకాపా ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు చేదు అనుభవం.గడప గడపకు కార్యక్రమంలో భాగంగా బంగారుపాళ్యం మండలంలోని మొగిలివారి పల్లెలో పర్యటించిన ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు.గ్రామంలోకి ఎమ్మెల్యే రాగానే ఒక్కసారిగా తెదేపా జెండాలు కట్టిన గ్రామస్థులు. గ్రామంలోని భజన గుడి మైక్ ద్వారా ...సైకో పోవాలి సైకిల్ రావాలిలి పాటను వినిపించిన గ్రామస్థులు .ప్రజలపై అసహనం వ్యక్తం చేసి కార్యక్రమాన్ని రద్దు చేసుకుని వెనుదిరిగిన ఎమ్మెల్యే ఎంఎస్ బాబు. నాయకులు కార్యకర్తలు.

## పవిత్ర పుణ్య స్నానం దుర్గాఘాట్స్ ను పరిశీలించి వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన.. చైర్మన్ కర్నాటి



ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: విజయవాడ పశ్చిమ ఇంద్రకీలాద్రి స్నానాలరేవులో చైర్మన్ కర్నాటి రాంబాబు పాలక మండలి సభ్యులు బుద్ధా రాంబాబు.. బొచ్చు మాధవి మురళి వారు విస్తృతంగా దుర్గా స్నాన ఘాట్స్ తనిఖీ చేసి మహిళా భక్తులకు డ్రెస్ చేంజింగ్ రూమ్స్ త్వరిత గతిన పూర్తి చేయాలని మరియు భక్తులకు స్నాన ఘాటును కృష్ణ నదిలో పవిత్ర స్నానం ఆచరించుటకు ఘాట్ పూర్తిగా క్లీనింగ్ చేయుటకు క్లీనింగ్ బోటును అద్దె పద్ధతిన పెట్టి క్లీనింగ్ పనులు వేగంగా జరుగుచున్నవి , ప్రత్యేకంగా మనుషుల్ని కూడా పెట్టి రేవులో పారవేసిన వ్యర్థాలను తొలగించుటకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగినది రానున్న రెండు మూడు రోజుల్లో స్నాన ఘాట్ నందు భక్తులు పవిత్ర పుణ్య స్నానం ఆచరించుటకు అన్ని చర్యలు తీసుకోవడం అయినదని ఆలయ చైర్మన్ సిబ్బందికి సూచించారు.

## స్మార్ట్ సిటీ పనులపై వీసిలో వివరించిన కమిషనర్ హరిత ఐఏఎస్



తిరుపతి :ప్రజాపాలన ప్రతినిధి: తిరుపతి స్మార్ట్ సిటీ తరుపున జరుగుతున్న ప్రాజెక్ట్ పనుల గురించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిల్లీ నుండి కాన్ఫరెన్స్ ద్వారా రివ్యూ నిర్వహించిన స్మార్ట్ సిటీ మిషన్ డైరెక్టర్ కునాల్ కుమార్ కు తిరుపతి స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఏఎస్ వివరించారు. మొదట మిషన్ డైరెక్టర్ కునాల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ప్రాజెక్టులకు ఉపయోగించాలని, చేపట్టిన ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి స్మార్ట్ సిటీ ఎం.డి, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఏఎస్ స్పందిస్తూ తిరుపతి నగరంలో జరుగుతున్న ప్రాజెక్టుల వివరాలను, జరుగుతున్న పనుల దశలను వివరించడం జరిగింది. ఐ ట్రీపుల్ సి పనులు గురించి మిషన్ డైరెక్టర్ అడగగా, పనులు చురుకుగా జరుగుతున్నాయని, త్వరలోనే మిగిలిన పనులు పూర్తి చేసి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని హరిత ఐఏఎస్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, స్మార్ట్ సిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన తండాలకి చెందిన మైనర్ బాలికపై అత్యాచారంకు గురైతే.. మహిళా కమిషన్ చైర్మన్ ఎందుకు స్పందించారు..






. ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: విజయవాడ. గిరిజన తండాలకి చెందిన మైనర్ బాలికలపై అత్యాచారం చేస్తూ లైంగిక వేధింపులకు పాల్పడుతున్న నవోదయ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డి పై స్టేషన్ బెయిల్ ఇచ్చే కేసు నమోదు చేయడంపై విజవాడ నగర పోలీస్ కమిషనర్ క్రాంతి రానా టాటా సమాధానం చెప్పాలి.గిరిజన మైనర్ బాలికలపై కడప జిల్లాకు చెందిన రవీంద్రారెడ్డి అత్యాచారం చేస్తూ లైంగిక వేధింపులకు పాల్పడుతున్న మహిళా కమిషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ. ఎందుకు స్పందించారు? స్థానిక ప్రజా ప్రతినిధి. సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు... ఎమ్మెల్సీ రుహుల్ల కార్యాలయాలకు కూత వేటు దూరంలోనే గిరిజన మైనర్ బాలికలపై లైంగిక వేధింపులు దాడులు జరుగుతుంటే స్పందించరేం? ఈ ఘటనపై ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు దేవినేని అవినాష్.లు ఎందుకు మౌనంగా ఉన్నారు..నవోదయ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డిని కఠినంగా శిక్షించాలి..నవోదయ నర్సింగ్ కళాశాల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలి. అక్కడ చదువుతున్న విద్యార్థినిల భవిష్యత్తును భద్రంగా కాపాడాల్సిన బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తీసుకోవాలి... 100 మంది బాలికలు చదువుతున్న నర్సింగ్ కళాశాలలో సీసీటీవీలు ఎందుకు ఏర్పాటు చేయలేదు?..భోజన వసతి అధ్వానంగా నాసిరకంగా ఉంది...పాత ప్రభుత్వ ఆసుపత్రిలో రవీంద్రారెడ్డి చేతిలో లైంగిక దాడికి గురైన విద్యార్థిని కలిసిన జనసేన పార్టీ విజయవాడ నగర అధ్యక్షులు పోతిన వెంకట మహేష్. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ఇటువంటి అరాచకాలు చేస్తున్నటువంటి వారు కాపాడుతున్నవారు కొంతమంది ఉన్నారు అని.. అందుకే వారు ఇలా మహిళలపై ప్రవర్తిస్తున్నారు... మీకు జనసేన పార్టీ తరఫున ఎప్పుడు అండగా ఉంటాం. మీకు ఎటువంటి అవసరం ఏదైనా తక్షణం మమ్మలను సంప్రదిస్తే మీ సమస్యకు మీ అండగా ఉంటామని జనసేన పార్టీ నాయకుడు మహేష్ వారికి భరోసా కనిపించారు..

## అనారోగ్య బాధితునికి 10,000 రూపాయల ఆర్థిక సహాయం అందజేసిన వెలగపూరి కరుణాకర్ రావు



గుర్రంపోడు:ప్రజాపాలన ప్రతినిధి: గుర్రంపోడు మండలం బొల్లారం గ్రామపంచాయతీ 3 వ వార్డు మెంబర్ తరి వీరయ్య గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న నేపథ్యంలో గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వీకేఆర్ కన్స్ట్రక్షన్స్ అధినేత వెలగపూరి కరుణాకర్ రావు బొల్లారంలోని తన నివాసంలో తరి వీరయ్యకు తన వంతు సహాయంగా 10,000 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న సాటి మానవునికి సహాయం అందించడం మానవ ధర్మమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జంగాల చిన్న చంద్రయ్య, వెలగపూరి రాంబాబు రావు, వెలగపూరి శేఖర్ రావు,ఎండీ సర్వర్,కామల్ల రాములు,మెండె యాదయ్య,ఐతరాజు చంద్రశేఖర్, సైదులు,నాగేటి జయరాజు,తరి లక్ష్మయ్య,ఎండీ మౌలానా,నజీర్, అజ్జు,తరి మల్లయ్య,గిరి,తరి శంకరయ్య,ఆర్ శంకరయ్య,తరి శేఖర్,బైరు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే, విమానఃయాన సంస్థల కార్మికులు, ప్రైవేటీకరణ చేసిన విభాగాల కాంట్రాక్టర్ల పనితీరును ప్రభుత్వం పరిశీలించాలి: సీపాన గుణవతి



విజయవాడప్రజాపాలన ప్రతినిధి: కేంద్రప్రభుత్వ ప్రతిష్టాత్మక రంగ సంస్థలైన రైల్వే, విమానఃయాన సంస్థల కార్మికులు, ప్రైవేటీకరణ చేసిన విభాగాల కాంట్రాక్టర్ల పనితీరును ప్రభుత్వం నిశితంగా పరిశీలించవలసి ఉందని ప్రముఖ సంఘసేవకురాలు,అఖిల భారత బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర మహిజా ప్రచార కమిటీ కన్వీనర్ డాక్టర్ సీపాన. గుణవతి అన్నారు. గురువారం నాడు మీడియా ప్రతినిధులకిచ్చిన ప్రకటనలో ఆమె ఈవిషయం పై మాట్లాడుతూ ప్రమాదం జరగక ముందు భద్రతా చర్యలు తీసుకోవడం అవసరమని,ప్రమాదం జరిగి ప్రాణనష్టం జరిగిపోయిన తరువాత అధికారుల సమీక్షలు,హంగామల ప్రయోజనం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ఇటీవల ఒడిశాలో జరిగిన ఘోరమైన రైలు ప్రమాదం ఇది వరకు ఏక్కడా జరిగి ఉండదనిఎందుకంటే మూడు రైళ్లు ఒకే సారి ప్రమాదానికి గురి కావటం మన దేశంలో ఇది మొదటిసారి కావచ్చని ఆమె అన్నారు. నిర్లక్ష్యానికి కారణమైన ఈ ప్రమాదాన్ని కేంద్రప్రభుత్వం కుట్ర కోణంలో చూడటం అనేకమంది మేధావులు తప్పు పట్టారని,ఇలాంటి వాక్యలు ప్రజల్లో ఆందోళన కలిగిస్థాయిని ప్రధాని మోడీ కి ఇటీవల ట్విట్టర్లో పోస్టు పెట్టినట్లు డాక్టర్ గుణవతి తెలిపారు. అధికారులను ఈటింగులకు,మీటింగులకు పరిమితం చేయకుండా ప్రమాదాలు జరగకుండా సాంకేతికపరమైన శిక్షణానివ్వాలని ట్విట్టర్లో సూచించినట్లు ఆమె చెప్పారు. ఈ ప్రమాదానికి గురైన ఆంధ్రప్రదేశ్ బాధితులకు రాష్ట్రముఖ్యమంత్రి అందించిన చేయూత అభినందనీయమని ఆమె ప్రశంసించారు.

## అక్రమాలకు అడ్డాగా రిజిస్ట్రార్ కార్యాలయాలు..



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి: అక్రమాలకు అడ్డాగా రిజిస్ట్రార్ కార్యాలయాలు మారుతున్నాయి. ఏసీబీ దాడులు చేస్తున్న వదలని అవినీతి కంపు వదలడం లేదు. విజయవాడలోని పటమట, గాంధీనగర్, మాచవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కాసుల వర్షం కురుస్తోంది..పటమట రిజిస్ట్రార్ పోస్ట్ కోసం కోటి నుంచి కోటిన్నర వరకు బేరాలు సాగుతున్నట్లు సమాచారం. ఆడిట్ ఆఫీస్ లో రిజిస్ట్రార్, డిప్యూటేషన్ విధుల్లో ఉన్న మరో రిజిస్ట్రార్ పోటా పోటీ లాబీయింగ్ చేస్తున్నారని, రిజిస్ట్రార్ ఆఫీసుల్లో వసూళ్ళ కోసం మళ్లీ ప్రైవేట్ సిబ్బంది ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది..ఇటీవల డబ్బులు వసూలు చేస్తున్న ముగ్గురిని ఏసీబీ అరెస్ట్ చేసినా రిజిస్ట్రార్ల తీరు మారడం లేదు. ఇబ్రహీంపట్నం రిజిస్ట్రార్ ఆఫీసులో అర్థరాత్రి వరకు రిజిస్ట్రార్, సిబ్బంది ఉండటంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఆదాయానికి మించి కోట్లలో ఆస్తులు రిజిస్ట్రార్లు కూడగడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఏసీబీ తనిఖీలు కేవలం లంచం తీసుకుంటూ పట్టుబడుతున్న కేసులే నమోదు చేయటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బెజవాడలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ల మధ్య కోల్డ్ వార్ తారా స్థాయికి చేరినట్లు తెలుస్తోంది. ఒకరిపై మరొకరు ఫిర్యాదులతో రచ్చకెక్కుతున్నారట. ఇటీవల సబ్ రిజిస్ట్రార్ రాఘవ రావు అరెస్ట్ రిమాండ్ రిపోర్టు లో దిమ్మదిరిగే విషయాలు నమోదు చేసింది ఏసీబీ. రిజిస్ట్రార్లు అందరూ డబ్బులు వసూలు చేసి ఉన్నతాధికారికి ఇస్తున్నట్టు చెప్పినట్టు ఏసీబీ రిమాండ్ రిపోర్ట్ ఉండటం గమనార్హం..

## విద్యార్థిని అత్యాచారం చేసిన నిందితుడైన ఫణి స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్. అరెస్ట్



ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: విజయవాడ పశ్చిమ నియోజకవర్గం. అల్లూరి సీతారామ రాజు జిల్లా, యటపాక మండలం, రాఘవాపురం గ్రామానికి చెందిన యువతి విజయవాడ అంబాపురం ఫణి స్కూల్ ఆఫ్ సర్సింగ్ కళాశాల నందు 2017 నుండి 2020 సంవత్సరం వరకు జి.యం నర్సింగ్ కోర్సు చదివినట్లు, ఆ సమయంలో సదరు కళాశాల ప్రిన్సిపాల్ అయిన బసిరెడ్డి. రవీందర్ రెడ్డి ఈమెతో అనేక సార్లు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు అదేవిధంగా సర్టిఫికేట్ లను ఇవ్వను అని బయపెట్టి, బలవంతం చేసి పలుమార్లు శారీరకంగా కలిసినట్లు, మూడు సార్లు గర్భ నిరోధక మాత్రలతో గర్భస్రావం చేయించినట్లు, తరువాత అనారోగ్య సమస్యల వలన జి. ఎన్. యం నర్సింగ్ ట్రైనింగ్ చెయ్యలేక. స్వగ్రామం వెళ్లిపోయినట్లు, ది.05.06.2023 తేదిన ఫణి స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బసిరెడ్డి. రవీందర్ రెడ్డి విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని న్యూస్ చానెల్స్ లో రాగా సదరు యువతి ది.07.06.2023 తేదీన విజయవాడ టూటౌన్ పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేయగా సదరు ఫిర్యాదుపై టూటౌన్ పోలీస్ వారు Cr. No.520/2023 U/S 376 (2) (1), 376(2) (n%) × |¾ d¾ ™d¿£ŒHŽ 3 (2) (%V) of% mdt. d¾ ఎస్.టి పి. ఓ. ఏ యాక్ట్ గా కేసు నమోదు చేసినారు. అనంతరం సదరు సంఘటనను తీవ్రనేరంగా పరిగణించి సదరు సంఘటనపై దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి శిక్ష పడేలాగా చేయాలని నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా ఐ.పి.ఎస్. ఆదేశాల మేరకు డి.సి.పి. డా.అజిత పేజెండ్ల ఐ.పి.ఎస్. పర్యవేక్షణలో పశ్చిమ ఏ.సి.పి. డా. కె.హనుమంతరావు, టూటౌన్ ఇన్స్పెక్టర్. ఎ.సుబ్రహ్మణ్యం వారి సిబ్బందితో సదరు ఘటనపై విచారించి నిందితుడైన ఫణి స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బసిరెడ్డి రవీందర్ రెడ్డిని గురువారం అదుపులోనికి తీసుకుని అరెస్ట్ చేయడం జరిగింది.

## ప్రభుత్వ ఆస్తులు కబ్జా.. చోద్యం చూస్తున్న అధికారులు



ఆగిరిపల్లి ప్రజాపాలన ప్రతినిధి: హైకోర్ట్ ఆర్డర్ ని సైతం లెక్క చేయని కబ్జాధారులు చర్యలు తీసుకోని ప్రభుత్వ అధికారులు చ వివరాల్లోకి వెళితే ఎల్లూరు జిల్లా అగిరిపల్లి మండలం ఈదర గ్రామములో 5 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని అదే గ్రామానికి చెందిన మొగదాటి ప్రకాశం మరియు సుధాకర్ రావు ప్రభుత్వ భూమిని ఆక్రమించడమే కాకుండా ప్రక్కనే గల 4 గజాల ధారిని కూడా ఆక్రమించి ఐరన్ ఫెన్సింగ్ వేసి ఉన్నారు. ఈ విషయమై స్థానిక నివాసి అయిన బి.తిరుపతయ్య హై కోర్ట్ ను ఆశ్రయించడంతో హై కోర్ట్ వారు రిట్ నెంబర్ 14164/2022గా స్వికరించి 15-07-2022 తేదీన ఆదేశాల ను జారీచేస్తూ ప్రతివాదులైన ఎలూరు జిల్లా కలెక్టర్,అగిరపల్లి తహసీల్దారు, ఈదర గ్రామ సెక్రటర్లకు ఆదేశాలిస్తూ ప్రభుత్వ స్థలాని కబ్జా చేసిన మొగదాటి ప్రకాశం మరియు సుధాకర్ మరియు వాలంటీర్ మొగదాటి సంతోస్ కుమార్ మరియు ఇతరుల పై చర్యలు తీస్కొవాలని వారు అక్రమంగా నిర్మించిన ఐరన్ ఫెన్సింగ్ ను 3వారల్లోగా తొలగించమని హై కోర్ట్ వారు ఆదేశాలను జారీ చేసినారు. గడువు ముగిసిన గాని ఇంతవరకు అధికారులు కోర్టు ఆదేశాలను అమలు చేయక పోవడంతో కబ్జాదార్లకు మరియు ప్రభుత్య అధికారులకు మధ్య లక్షల రూపాయలు చేతులు మారాయి అని స్థానిక ప్రజలు మాట్లాడుకోవడం విశేషం. హై కోర్టు నోటీసు అందిన పిదప అగిరిపల్లి తహసీల్దారు కబ్జా దారులకు నోటీసు ఇచ్చిన మరుసటి రోజే కబ్జాకి గురైన కాళీ స్థలంలోనే మరుసటి రోజు రేఖుల షెడ్డు ను నిర్మించడం చూసి స్థానికులు అర్చర్యానికి గురికావడం తమ వంతయినది. ఒక ప్రక్క గౌరవ హైకోర్ట్ వారు ప్రభుత్వ స్థలాలను కబ్జాలకు గురి కాకుండా చూడమంటే, అధికారులు మాత్రం కబ్జాధారులతో కుమక్కయి అందినకాడికి ప్రభుత్వ ఆస్తులును కబ్జాదారుల పాలు చేస్తున్నారన్నారు. సంబంధిత పంచాయతీ రెవిన్యూ అధికారులు హై కోర్టు ఆర్డర్ ప్రకారము గడువు ముగిసిన తరవాత కూడా ఆర్డర్ ను అమలు చేయకపోవడంతో పిటిషనర్ హైకోర్టు లో కాంటెంప్ట్ అఫ్ కోర్టు కింద తగు చర్యల నిమింతం,ఏలూరు జిల్లా కలెక్టర్, అగిరిపల్లి తహసీల్దార్, ఈదర గ్రామ పంచాయతీ ల సెక్రటరీ పై కోర్టు ఆర్డర్ ఉలంగణ కింద హై కోర్టు లో కేసు దాకాలు చేయడం జరిగినది. ఒక ప్రక్క హై కోర్టు లో కేసు పెండింగ్ లో ఉండగా తప్పుడు డోర్ నెంబర్ తో, తప్పుడు సర్వే నెంబర్ తో మరియు తప్పుడు డాక్యూమెంట్ ల తో నూజివీడు కి బదులుగా గన్నవరం సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో ఈదర గ్రామ వాలంటీర్ మొగదాటి సంతోస్ కుమార్ మరియు నరేష్ అనే వారి పేరుమీద అక్రమ రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. అక్రమదారుల పై అధికారులు ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఒకపక్క సుప్రీమ్ కోర్టు, హై కోర్టు వారు ప్రభుత్వ ఆస్తులను రక్షించమని తీర్పులు ఇస్తుంటే ప్రభుత్య అధికారులు మాత్రం ప్రభుత్య ఆస్తులని రక్షించకపోగా కబ్జా దారులకు దారాధతం చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన G.O.Ms.no:188 ని కూడా అధికారులు అమలు చెయ్యట్లేదు అని సుప్రీం కోర్టు, హై కోర్టు ఆర్డర్లును సైతం అధికారులు అమలు చేయడం లేదని, న్యాయవాది అశోక్ కుమార్ వ్యాకణించారు.



## అలవైకుంఠపురములో' మాదిరిగా 'గుంటూరు కారం' కి కూడా ?




సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ప్రస్తుతం తెరకెక్కుతున్న లేటెస్ట్ మాస్ కమర్షియల్ మూవీ గుంటూరు కారం. మొదటి నుండి అందరిలో భారీ అంచనాలు ఏర్పరిచిన ఈ మూవీ పై సూపర్ స్టార్ మహేష్ ఫ్యాన్స్ తో పాటు ఆడియన్స్ లో కూడా భారీ అంచనాలు ఉన్నాయి. పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్స్ గా నటిస్తున్న ఈ మూవీ నుండి ఇటీవల రిలీజ్ అయిన మాస్ స్ట్రైక్ గ్లింప్స్ అందరినీ విశేషంగా ఆకట్టుకుని మూవీ పై ఇప్పటివరకు ఉన్న అంచనాలు అమాంతం పెంచేసింది. విషయం ఏమిటంటే, అల్లు అర్జున్ హీరోగా త్రివిక్రమ్ గత సూపర్ హిట్ మూవీ అలవైకుంఠపురములో మ్యూజికల్ గా కూడా సెన్సేషనల్ సక్సెస్ అందుకుంది. ఇక ఆ మూవీ నుండి ఫస్ట్ సాంగ్ ని సినిమా రిలీజ్ కి మూడు నెలల ముందే రిలీజ్ చేసారు. అక్కడి నుండి మూవీలోని ఒక్కో సాంగ్ ని రిలీజ్ చేస్తూ వచ్చారు యూనిట్. మ్యూజిక్ సూపర్ గా ఆడియన్స్ ని ఆకట్టుకోవడం అలానే జనవరి 2020 లో రిలీజ్ అయిన మూవీ కూడా అంచనాలు అందుకోవడంతో అది సూపర్ హిట్ కొట్టింది. కాగా అదే విధమైన స్ట్రాటజీని గుంటూరు కారం కోసం అనుసరించనున్నారట మేకర్స్. ఈ రోజుల్లో ఏ సినిమా సక్సెస్ కి అయినా మ్యూజిక్ ముఖ్య పాత్ర పోషిస్తుండడంతో గుంటూరు కారం నుండి కూడా రెండు లేదా మూడు నెలల ముందు నుండే సాంగ్స్ రిలీజ్ చేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నారనేది లేటెస్ట్ టాలీవుడ్ బజ్. మరోవైపు థమన్ ఈమూవీ కి ఐదు అదిరిపోయే ట్యూన్స్ సిద్ధం చేశారట. మరి ఇదే కనుక నిజం అయితే సూపర్ స్టార్ ఫ్యాన్స్ కి ఇది సూపర్ గుడ్ న్యూస్ అనే చెప్పాలి. అయితే ప్రస్తుతం వైరల్ అవుతున్న ఈ న్యూస్ పై గుంటూరు కారం నిర్మాతలైన హారికా హాసిని క్రియేషన్స్ వారి నుండి అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. కాగా ఈ మూవీని 2024 సంక్రాంతి కానుకగా జనవరి 13న విడుదల చేయనున్నారు.

## ఓటిటి లో కూడా అదరగొడుతోన్న '2018'




ఇటీవల మలయాళంలో రూపొంది అక్కడి బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం అందుకున్న సినిమా 2018. కొద్దిరోజుల క్రితం ఈ సినిమా తెలుగులో కూడా విడుదలై నాలుగు రోజుల్లో రూ. 4 కోట్లను వసూలు చేసి అదరహో అనిపించింది. ఇక ఈ సర్వైవల్ థ్రిల్లర్ లో టోవినో థామస్, ఇంద్రన్స్, కుంచాకో బోబన్, అపర్ణ బాలమురళి, వినీత్ శ్రీనివాసన్, ఆసిఫ్ అలీ, లాల్, నరేన్, తన్వి రామ్, శివద, కలైయరసన్, అజు వర్గీస్, సిద్ధిక్, జాయ్ మాథ్యూ, సుధీష్ కీలక పాత్రలు పోషించారు. నోబిన్ పాల్ మరియు విల్లమ్ ఫ్రాన్సిస్ స్వరాలు అందించారు. ఈ సినిమా నిన్న రాత్రి నుండి ప్రముఖ ఓటిటి మాధ్యమం సోనీ లివ్ లో పలు భాషల్లో బుల్లితెర ఆడియన్స్ ముందుకి వచ్చింది. అయితే విషయం ఏమిటంటే ప్రస్తుతం, 2018 సోనీ లివ్ ఇండియాలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అటు థియేటర్స్ లో బాక్సాఫీస్ రికార్డులను అదరగొట్టిన తమ సినిమా ఇటు ఓటిటిలో కూడా భారీ వీక్షణలను పొందుతుండడంతో యూనిట్ ఆనందం వ్యక్తం చేస్తోంది. వేణు కున్నప్పిల్లి, సి.కె. పద్మ కుమార్ మరియు ఆంటో జోసెఫ్ 2018 మూవీని గ్రాండ్ లెవెల్లో నిర్మించగా జూడ్ ఆంథనీ జోసెఫ్ దీనికి దర్శకత్వం వహించారు.


## నాయకుడి కొడుకుని పెళ్లాడుతున్న కుందనపు బొమ్మ

యూత్ స్టార్ నితిన్ సరసన వరస చిత్రాల్లో నటించి తెలుగు నాట అభిమానుల్ని సంపాదించుకుంది మేఘా ఆకాష్. ఈ బ్యూటీ తమిళంలోను నటిస్తున్న సంగతి తెలిసిందే. మేఘా ఆకాష్ హిందీలో సల్మాన్ ఖాన్ నటించిన రాధే సహా పలు చిత్రాల్లో నటించింది. కానీ దురదృష్టవశతాత్తూ కెరీర్ లో ఆశించిన పెద్ద విజయాన్ని అందుకోలేకపోయింది. అయినా జయాపజయాలతో అవకాశాలు అందుకుంటున్న మేటి నాయికగా మేఘా పేరు వినిపిస్తోంది. ప్రస్తుతం ఈ బ్యూటీ వరుస చిత్రాల్లో నటిస్తోంది. మను చరిత్ర మజై పిడికథ మనితన్ – బూ అనే మూడు చిత్రాలు త్వరలో విడుదల కానున్నాయి. ఇంతలోనే ఆమె పెళ్లిపై ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. మేఘా ఆకాష్ ప్రముఖ రాజకీయ నాయకుడి కుమారుడిని పెళ్లాడబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇంకా అధికారిక ప్రకటన రానప్పటికీ పెళ్లికి సంబంధించిన ప్లాన్స్ ఇప్పటికే జరుగుతున్నాయని సమాచారం. అయితే అధికారికంగా ఈ వార్తల్ని ధృవీకరించాల్సి ఉంది. క్రీడాకారులు పారిశ్రామిక వేత్తలు రాజకీయ నాయకుల పుత్ర రత్నాల్ని పెళ్లాడేందుకు కథానాయికలు వెనకాడడం లేదు. ఇటీవల హన్సిక ప్రముఖ బిజినెస్ మేన్ ని పెళ్లాడింది. రాఘవ్ చద్దా అనే ఎంపీని పరిణీతి చోప్రా వివాహం చేసుకుంది. ఇదే బాటలో ఇప్పుడు మేఘా ఆకాష్ కూడా ఒక నాయకుడి వారసుడినే పెళ్లాడబోతోందని గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు టాలీవుడ్ యువహీరో శర్వానంద్ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి యువతి ని పెళ్లాడనున్న సంగతి తెలిసిందే. అతడి కాబోయే భార్య రక్షిత రెడ్డి సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా పని చేస్తున్నారు.



ఇటీవల ఈ జంట నిశ్చితార్థం పూర్తయింది.

## క్రేజీ డైరెక్టర్ తో రణబీర్ 'రామాయణం' ఏమైనట్టు?



మరొక సినిమాని పురాణేతిహాసం రామాయణం ఆధారంగా తెరకెక్కించాలని ప్రముఖ దర్శకుడు నితీష్ తివారీ ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో శ్రీరాముడిగా రణబీర్ కపూర్.. సీతగా సౌత్ స్టార్ సాయి పల్లవి.. రావణ్ పాత్రలో హృతిక్ నటిస్తారని గతంలో ప్రచారమైంది. అయితే ఈ సినిమా తాజా అప్ డేట్ ఏంటి? అన్నది ఆరా తీస్తే షాకిచ్చే విషయం తెలిసింది. ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతానికి హోల్డ్లో ఉంచినట్లు తెలుస్తోంది. చాలా కాలం తర్వాత నితీష్ తివారీ తన రామాయణం ప్రాజెక్ట్ ని నిరవధికంగా వాయిదా వేయాలని నిర్ణయించుకున్నట్లు కథనాలొస్తున్నాయి. ఇప్పటికే కథాంశంపైనా వర్క్ జరుగుతోంది. ప్రీప్రొడక్షన్ కాస్టింగ్ ఎంపికలపైనా కసరత్తు సాగింది. కానీ దీనిని ప్రస్తుతానికి హోల్డ్ లో ఉంచారు. అయితే నితీష్ తన శక్తులన్నింటినీ మరొక ప్రాజెక్ట్ పై కేంద్రీకరిస్తాడు. వరుణ్ ధావన్ – జాన్వీ కపూర్ జంటగా నటించిన బవాల్ విడుదల తర్వాత నితీష్ తదుపరి ప్రాజెక్ట్ ని ప్రకటిస్తారని తెలిసింది. నిజానికి నితీష్ రామాయణం ప్రకటించగానే... సీతగా నటించేందుకు దీపికా పదుకొణెతో నిర్మాతలు చర్చలు జరుపుతున్నట్లు ప్రచారం జరిగింది. కానీ అదే ప్రొడక్షన్ హౌస్ దీపిక ద్రౌపది పాత్రను పోషిస్తుందని అందుకే సాయి పల్లవిని సీత పాత్ర కోసం ఎంపిక చేసుకున్నారని ప్రచారమైంది. అంతేకాదు రావణుడి పాత్ర కోసం హృతిక్ రోషన్ ని సంప్రదించారని అయితే ఆ ప్రాజెక్ట్ ముందుకు సాగకపోవడంతో హృతిక్ ఇతర ప్రాజెక్టులతో ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. హృతిక్ కి రావణుడిగా నటించడం చాలా ఇష్టం. నిజానికి కొన్ని సంవత్సరాల క్రితం అతని మాజీ మామగారు సంజయ్ ఖాన్ ప్లాన్ చేసిన 'రామాయణం' పెద్ద స్క్రీన్ వెర్షన్ లో శ్రీరాముడిగా నటించడానికి హృతిక్ కి అవకాశం ఇచ్చారు. కానీ అది జరగలేదు. ఇప్పుడు హృతిక్ కి ఇతర కమిట్ మెంట్ లు ఉన్నందున రావణ్ గా నటించే అవకాశాన్ని వదులుకున్నాడు. హృతిక్ ఇకపై ప్రతి రెండేళ్లకు ఒక ప్రాజెక్ట్ చేయాలనుకుంటున్నాడు. అతడు ప్రస్తుతానికి ప్రతి సంవత్సరం రెండు ప్రాజెక్ట్ లు చేస్తున్నాడు అని హృతిక్ స్నేహితుడు వెల్లడించాడు.

ఈ వారంలో విడుదల కానున్న ఆదిపురుష్ విడుదల కోసం ప్రభాస్ అభిమానులు ఆసక్తిగా వేచి చూస్తున్నారు. ఇప్పటికే ట్రైలర్ లాంచ్ ప్రీరిలీజ్ వేడుకలతో ప్రచారం పీక్స్ కి చేరుకుంది. అయితే ఆదిపురుష్ కాకుండా

## జపాన్ వేటకి 'కేజీఎఫ్' రెడీ!

ఇండియన్ బాక్సీఫీస్ వద్ద 'కేజీఎఫ్' ఫ్రాంచైజీ దుమారం గురించి చెప్పాల్సిన పనిలేదు. రెండు భాగాలు బాక్సాఫీస్ వద్ద దుమ్ము దులిపేసిన సంగతి తెలిసిందే. ఎలాంటి లేకుండా రిలీజ్ అయిన కేజీఎఫ్ 250 కోట్లు కొల్లగొడితే! 'కేజీఎఫ్ -2' ఏకంగా భారీ అంచనాల తో రిలీజ్ అయి 1200 కోట్ల వసూళ్లని సాధించి కన్నడ పరిశ్రమని పాన్ ఇండియాలో ఫేమస్ చేసింది. తాజాగా 'కేజీఎఫ్' ఫ్రాంచైజీ జపాన్ రిలీజ్ కి రెడీ అవుతోంది. రెండు భాగాలు భారీ ఎత్తున విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే అనువాద పనులు శర వేగంగా జరుగుతున్నట్లు సమాచారం. టెక్నికల్ గా హైలైట్ చేయాల్సిన సినిమా కాబట్టి జపాన్ ప్రేక్షకుల్ని దృష్టి లో పెట్టుకుని అన్నిరకాలు



బెస్ట్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చేలా పనులు చేస్తున్నట్లు తెలుస్తుంది. అయితే మొదటి భాగం ఎప్పుడు రిలీజ్ అవుతుంది? రెండవ భాగం ఎప్పుడు రిలీజ్ చేస్తారు? అన్నది క్లారిటీ రావాల్సి ఉంది. రెండు భాగాలు ఒకదానికొక టి ఇంటర్ లింక్. మొదటి భాగం చూసిన తర్వాతే రెండవ భాగం చూడాలి. ఒకే రకమైన పాత్రల చుట్టూ తిరిగే కథ కాబట్టి! రిలీజ్ ఆర్డర్ ప్రకారమే జరుగుతుంది. ఈ నేపథ్యంలో జపాన్ లో 'కేజీఎఫ్' వసూళు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారుతుంది. ఇండియన్ బాక్సాఫీస్ వద్ద 'ఆర్ ఆర్ ఆర్' కి పోటీ గా నిలిచింది కేజీఎఫ్. ఈ నేపథ్యంలో జపాన్ లోనూ పోటీ ఇస్తుందా? అన్నది ఇంట్రెస్టింగ్ టాపిక్. 'ఆర్ ఆర్ ఆర్' జపాన్ లో 119 కోట్ల వసూళ్లు సాధించింది. భారతీయ చిత్రాల్లో 'ఆర్ ఆర్ ఆర్' అక్కడ సరికొత్త రికార్డు సృష్టించింది. అంతకు ముందు భారీ వసూళ్ల భారతీయ చిత్రంగా 'ముత్తు' ఉండేది. 'ఆర్ ఆర్ ఆర్' ఆ సినిమా రికార్డుల ను కొల్లగొట్టింది. మరి ఇప్పుడు భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతున్న 'కేజీఎఫ్' ఫ్రాంచైజీ అంతటి సత్తా చాటుతుందా? అన్నది చూడాలి. సినిమా ని అక్కడ పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. చిత్ర నిర్మాణ సంస్థ హొంబలే ఫిల్మ్స్ – యశ్–ప్రశాంత్ నీల్ ఆర్ ఆర్ ఆర్ తరహా లో ప్రమోట్ చేస్తే బిజినెస్ పరంగా వర్కౌట్ అవుతుందని భావిస్తున్నట్లు తెలుస్తుంది.

## ఇంట్రెస్టింగ్.."దళపతి 68 కి ఖుషి హీరోయిన్.?




ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ఇళయ దళపతి విజయ్ హీరోగా త్రిష హీరోయిన్ గా టాలెంటెడ్ దర్శకుడు లోకేష్ కనగ రాజ్ తో భారీ పాన్ ఇండియా సినిమా "లియో" చేస్తున్న సంగతి తెలిసిందే. మరి ఈ చిత్రం విజయ్ కెరీర్ లో 67 వ సినిమా కాగా ఈ సినిమా తర్వాత విజయ్ తన 68వ భారీ సినిమాని అయితే దర్శకుడు వెంకట్ ప్రభు తో రీసెంట్ గానే అనౌన్స్ చేసాడు. మరి దీనిపై కూడా క్రేజీ హైప్ నెలకొనగా లేటెస్ట్ గా అయితే ఇంట్రెస్టింగ్ బజ్ ఇప్పుడు తెలుస్తోంది. ఈ సినిమాలో హీరోయిన్ గా విజయ్ వింటేజ్ హిట్ "ఖుషి" హీరోయిన్ జ్యోతిక అయితే లాక్ అయ్యినట్టుగా ఇప్పుడు తమిళ సినీ వర్గాలు చెప్తున్నాయి. అయితే మన తెలుగు లో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, భూమికలు నటించిన ఈ సినిమా ని తమిళ్ లో కూడా మొదట ఖుషి గానే తెరకెక్కించారు. దీనితో ఇంట్రెస్టింగ్ పెయిర్ మళ్లీ ఇన్నాళ్ళకు రిపీట్ అవుతుంది అని తెలుస్తోంది. మరి దీనిపై అధికారిక క్లారిటీ రావాల్సి ఉంది.




Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com